



# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 42 | ఎడిటర్: మేనం శ్యామ్ | శనివారం 29-08-2026 | పేజీలు: 10


## సిరా చుక్క

కో-ఎడ్యుకేషన్ అంటేనే
కోపగించుకునే మనం,
కో-లివింగ్ దాకా ఎదిగినాం.
దించిన తల ఎత్తకుండా,
దిక్కులేమీ చూడకుండా,
గమనం—గమ్యం తప్ప
అన్యం—పుణ్యం తెలియని
బెదురు కళ్ల లేడి పిల్లపట్నంలో
కాలుపెట్టి "పరిపక్వత" చెందింది.
ఇద్దరి మదిలో, ఒకే గదిలో
సహజీవనం చేద్దామని,
తాళి లేకుండా, ఆలి కాకుండా,
పరాయి మగాన్నిపక్క పంచుకోమంది...
పరువు మరిచిపోయింది.
పెళ్లంటే వద్దంటూ, ఉద్యోగం ముద్దంటూ,
30న వచ్చే జీతాన్ని
మురిపెంగా చూసుకుంటూ,
కోరికలే గుర్రాలై,కనుసైగలే వరాలై,
కని పెంచిన వారిని వంచించి,
సహజీవన సంపర్కంలో కామంలో
మునుగుతుంది...
కాసుల్లో తేలుతుంది. సాఫ్ట్‌వేర్ జంటల
సంకరజాతి సంసారాలు,
ప్యాకేజీల వ్యవహారాలు,
సనాతనానికి యమపాశాలు!
కో-లివింగ్, ఓయో రూములు
వ్యభిచారానికి ప్రతిరూపాలు,
భారతీయ సంస్కృతికి
బందీఖానాలు!
లవ్ జిహాద్ లవ్వర్లు,
సమాజంలో భేవార్సులు...

— రాజిరెడ్డి శీలం. .., ఇనుగుర్తి

# జల వివాదాల్లో నో కాంప్రమైజ్





- రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం.. ఎక్కడా తగ్గొద్దు: సీఎం రేవంత్‌రెడ్డి
- మహారాష్ట్ర, ఏపీతో వివాదాలపై పకడ్బందీగా వాదనలు సిద్ధం చేయాలి
- తుమ్మిడిహట్టి విషయంలో 148 మీటర్ల ఎత్తుపై గట్టిగా నిలబడాలి
- కృష్ణా జలాలపై సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీలో తెలంగాణ వాదన బలంగా వినిపించాలి
- సుప్రీంకోర్టు నుంచి బోర్డుల వరకు ప్రతి వేదికపైనా సమగ్ర వ్యూహంతో ముందుకు వెళ్లాలి

**ప్రజా వాయిస్,హైదరాబాద్:** అంతర్రాష్ట్ర నదీజలాల వివాదాల్లో ఎక్కడా రాజీ పడొద్దని, తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర హక్కులకు భంగం కలిగేలా ఎలాంటి నిర్ణయానికీ తావివ్వకుండా అన్ని వేదికలపైనా పటిష్టమైన వాదనలు వినిపించాలని స్పష్టం చేశారు. శుక్రవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నీటిపారుదల శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉన్నతాధికారులు, న్యాయ నిపుణులు పాల్గొన్న ఈ సమావేశంలో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌తో కొనసాగుతున్న జల వివాదాలు, సుప్రీంకోర్టు, సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీల వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలపై విస్తృతంగా చర్చించారు.

**తుమ్మిడిహట్టిపై పకడ్బందీగా..**

వచ్చేనెల 1న ఢిల్లీలో సీడబ్ల్యూసీ ఆధ్వర్యంలో తెలంగాణ—మహారాష్ట్ర అధికారుల సమావేశం జరగనున్న నేపథ్యంలో తుమ్మిడిహట్టి ప్రాజెక్టుపై సీఎం ప్రత్యేకంగా సమీక్షించారు. బ్యారేజీ ఎత్తు, మహారాష్ట్ర అభ్యంతరాలు, గతంలో కుదిరిన ఒప్పందాలు, ప్రాజెక్టు వల్ల తెలంగాణకు కలిగే ప్రయోజనాలు, ప్రభావాలు, నష్టాలు, ప్రత్యామ్నాయాలపై పూర్తి సమాచారంతో సిద్ధం కావాలని సూచించారు. మహారాష్ట్ర లేవనెత్తే ప్రతి అంశానికి సాంకేతిక, వాస్తవ ఆధారాలతో సమాధానం ఇచ్చేలా సన్నద్ధం కావాలని ఆదేశించారు. గతంలో అంగీకరించిన అంశాలను కూడా సమావేశంలో బలంగా ప్రస్తావించాలని చెప్పారు. 148 మీటర్ల వద్ద బ్యారేజీ నిర్మాణం వల్ల తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతినకుండా అవసరమైన అన్ని అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని స్పష్టం చేశారు.

**కృష్ణా జలాలపై గట్టిగానే..**

ఏపీ,తెలంగాణ మధ్య కొనసాగుతున్న కృష్ణా జల వివాదాలపై వచ్చేనెల 7న సీడబ్ల్యూసీ ఆధ్వర్యంలో కీలక సమావేశం జరగనుంది. ఇందులో రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా బలమైన వాదనలు వినిపించాలని సీఎం ఆదేశించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో నీటి విడుదల, నీటి పంపకాలు, తాగునీటి అవసరాలు, నీటి లభ్యత తదితర అంశాలపై తెలంగాణ వైఖరిని స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఇటీవల కేఆర్ఎంబీ సమావేశంలో తెలంగాణ 2027 ఆగస్టు వరకు తాగునీటి అవసరాలకు 112 టీఎంసీలు కేటాయించాలని కోరగా.. ఏపీ 47 టీఎంసీలు ప్రతిపాదించడంపై తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో అంశం వాయిదా పడింది. వచ్చే నెల 4న జరిగే కేఆర్ఎంబీ సమావేశంలోనూ రాష్ట్ర ప్రయోజనాల

మిగతా 2లో

## 120 మందికి పరీక్షలు.. 12 మందికే న్యాయమా?

- మిగిలిన 108 మందికి అనారోగ్యం లేదా.?
- మెడికల్ బోర్డుపై కవిత ఫైర్..
- సింగరేణి కార్మికుల జీవితాలతో సర్కార్ చెలగాటమా.?
- అర్హులైన వారందరినీ అన్‌ఫిట్‌గా గుర్తించాలి
- మెడికల్ అన్‌ఫిట్ దరఖాస్తులన్నీ పరిశీలించి న్యాయం చేయాలని కవిత డిమాండ్

2లో



## జల విలయం.. కన్నీటి ప్రవాహం

- నేపాల్‌ను ముంచెత్తిన వరదలు
- 584 మంది మృతి.. 2,500 మంది గల్లంతు
- 320 మంది భారతీయుల ఆచూకీ గల్లంతు
- 85 మంది భారతీయులను కాపాడిన రెస్క్యూ బృందాలు
- 21 మందిని సురక్షితంగా స్వదేశానికి తరలింపు
- 14 వేల మందితో సహాయక చర్యలు.. 3,742 మంది సేఫ్
- నేపాల్‌కు అన్ని విధాలా సాయం చేస్తాం: జైశంకర్



**ప్రజా వాయిస్,న్యూఢిల్లీ:** భారీ వరదలు నేపాల్‌ను అతలాకుతలం చేశాయి. భోటేకోశి, త్రిషూలీ నదీ పరివాహక ప్రాంతాలు మృత్యుభూములుగా మారాయి. ఎటుచూసినా బురద.. నేలమట్టమైన ఇళ్లు.. చెల్లాచెదురుగా కొట్టుకొచ్చిన మృతదేహాలు.. ఆప్తుల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలు.. హృదయ విదారక దృశ్యాలు కనిపిస్తున్నాయి.నేపాల్‌లో 579 మంది, చైనా వైపు మరో ఐదుగురు మృతిచెందడంతో మృతుల సంఖ్య 584కు చేరింది. మరోవైపు సుమారు 2,500 మంది గల్లంతైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్న కొద్దీ మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

**320 మంది భారతీయులు ఎక్కడ.?**

విపత్తులో పలుదేశాల పౌరులు గల్లంతయ్యారు. భారతీయుల్లో దాదాపు 320 మంది ఆచూకీ తెలియడం లేదు. మరో 100 మంది భారత సంతతి ప్రజలతోనూ సంబంధాలు తెగిపోయాయి. ఇప్పటి వరకు 85 మంది భారతీయులను రెస్క్యూ బృందాలు రక్షించగా.. వారిలో 21 మందిని భారత్‌కు తరలించారు.

**రంగంలోకి 14 వేల మంది**

వరద బాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. దాదాపు 14 వేల మంది భద్రతా సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొంటున్నారు. ఇప్పటివరకు 3,742 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అయితే భారీగా పేరుకుపోయిన బురద సహాయక చర్యలకు అడ్డంకిగా మారింది.

**అండగా భారత్: జైశంకర్**

నేపాల్ నుంచి స్వదేశానికి

మిగతా 2లో

## మంత్రి పొన్నంకూ ఓటరు నోటీసు

2లో

- తండ్రి పేరు తప్పుగా నమోదుపై బీఎల్‌వో చర్యలు
- ఎస్ఐఆర్ లో ఓటరు వివరాల పరిశీలనలో వెలుగుచూసిన పొరపాటు
- సవరణకు అవసరమైన ఆధారాలు సమర్పించిన మంత్రి పొన్నం
- ఓటరు జాబితాలో తప్పుల సవరణకు అధికారుల ప్రత్యేక దృష్టి
- ప్రజాప్రతినిధులకూ తప్పని ఎన్నికల నిబంధనలు
- సామాన్యుడైనా.. మంత్రైనా.. ఓటరు విషయంలో అందరికీ ఒకే రూల్



## సీఎం రేవంత్‌కు రాఖీ.. రాజీ సంకేతమా..?

- రేవంత్‌కు కొండా సురేఖ గోల్డ్ రాఖీలు
- సీఎం నివాసంలో మంత్రుల సందడి.. కలిసి రాఖీలు కట్టిన ఇద్దరు మంత్రులు
- పరకాల వివాదం.. క్రమశిక్షణ కమిటీ నివేదికల వేళ ఆసక్తికర పరిణామం
- బర్తరఫ్ ఊహాగానాల మధ్య సురేఖ చర్యతో కాంగ్రెస్‌లో హాట్‌టాపిక్
- 'ప్రతీ ఏడాది రాఖీ కడుతున్నా.. ఈసారి ప్రత్యేకంగా గోల్డ్ రాఖీ' అన్న సురేఖ



**ప్రజా వాయిస్,హైదరాబాద్:** తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. పరకాల వివాదం, తనపై పీసీసీ క్రమశిక్షణ కమిటీ ఏఐసీసీకి నివేదిక ఇచ్చిన నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టడం చర్చనీయాంశంగా మారింది. మంత్రి సీతక్క కూడా ఆమెతో కలిసి సీఎం నివాసానికి వెళ్లి రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టారు.శనివారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసానికి సురేఖ, సీతక్క వెళ్లారు. ముఖ్యమంత్రికి తిలకం దిద్ది రాఖీలు కట్టారు. అనంతరం సీఎం, మంత్రులు పరస్పరం స్వీట్లు తినిపించుకున్నారు. రాఖీ పండుగ

మిగతా 2లో

## ర్యాలీకి వెళ్లారు.. సస్పెండ్ అయ్యారు

2లో

- ఆర్ఎస్ఎస్ 'పథ సంచలన్'లో పాల్గొన్న ఇద్దరు ప్రభుత్వ టీచర్లపై వేటు
- ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నిబంధనలకు విరుద్ధమంటూ చర్యలు
- ఫిర్యాదుతో షోకాజ్ నోటీసులు.. వివరణ ఇచ్చినా తిరస్కరణ
- సెలవు రోజే కార్యక్రమం.. రాజకీయ సంబంధం లేదన్న టీచర్లు
- శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగింపు





## తెలంగాణలో క్రైమ్ అలర్ట్..!

- మూడేళ్లలో 7.15% పెరిగిన కేసులు
- 2.84 లక్షలకు చేరిన నేరాలు
- లక్ష జనాభాకు క్రైమ్ రేట్ 491.59కి పెరుగుదల
- తీవ్ర నేరాల్లో 10.33% తగ్గుదల
- ములుగు, నిర్మల్, ఆదిలాబాద్‌లో మాత్రం పెరుగుదల
- సైబర్, ఆర్థిక నేరాల్లో తగ్గుదల.. టెక్నాలజీ వినియోగాన్ని మరింత పెంచాలి
- నేరాల మూలాలు, నేరస్తుల విధానం, దర్యాప్తు తీరుపై లోతైన విశ్లేషణ అవసరం: డీజీపీ సీవీ ఆనంద్

ప్రజా వాయిస్,హైదరాబాద్: రాష్ట్రంలో నమోదవుతున్న నేరాల సంఖ్య పెరుగుతున్నప్పటికీ.. తీవ్ర నేరాలు మాత్రం తగ్గుముఖం పట్టాయి. గత మూడేళ్లలో తెలంగాణలో నమోదైన మొత్తం కేసులు 7.15 శాతం పెరిగాయి. 2023-24లో 2,65,377గా ఉన్న కేసులు 2025-26 నాటికి 2,84,363కు చేరాయి. లక్ష జనాభాకు నేరాల రేటు 481.58 నుంచి 491.59కి పెరిగింది. అదే సమయంలో తీవ్ర నేరాలు 10.33 శాతం తగ్గడం పోలీసు శాఖకు కొంత ఊరటనిచ్చింది.

మిగతా 2లో

# రాఖీ బంధానికి.. ఆర్టీసీ బాదుడు

- పండుగ రద్దీని క్యాష్ చేసుకున్న టీజీఎస్ఆర్టీసీ.. స్పెషల్ బస్సుల పేరుతో 50% వరకు అదనపు ఛార్జీలు
- సాధారణ సర్వీసులో రూ.290.. స్పెషల్‌లో రూ.400 వరకు వసూలు
- '1.50' నిబంధనతో ప్రయాణికులపై అదనపు భారం.. బస్సెక్కాకే అసలు షాక్
- ముందస్తు సమాచారం లేకుండానే అధిక వసూళ్లు.. ప్రయాణికులు–కండక్టర్ల మధ్య వాగ్వాదాలు
- జర్నలిస్టు పాసుల రాయితీలపైనా అభ్యంతరాలు
- 'మహాలక్ష్మి' రద్దీతో తప్పనిసరి ప్రయాణికులకు చుక్కలు




**ప్రజా వాయిస్,హైదరాబాద్:** రాఖీ పండుగ.. అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతీక. సోదరీమణులను కలుసుకునేందుకు పుట్టింటి బాట పట్టిన వారికి మాత్రం ప్రయాణం భారంగా మారింది. పండుగ రద్దీని ఆసరాగా చేసుకుని టీజీఎస్ఆర్టీసీ స్పెషల్ బస్సుల పేరుతో అదనపు ఛార్జీల మోత మోగిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణ సర్వీసులతో పోలిస్తే కొన్ని మార్గాల్లో ఏకంగా 50 శాతం వరకు అదనంగా వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగ కోసం సొంతూరికి వెళ్లాల్సిన మధ్యతరగతి, సామాన్య కుటుంబాలపై ఈ అదనపు భారం పడుతోంది.

**రూ.290 నుంచి రూ.400కు**

హైదరాబాద్,కరీంనగర్ మార్గంలో సాధారణ రోజుల్లో మెట్రో డీలక్స్, రాజధాని సర్వీసుల్లో సుమారు రూ.290గా ఉండే టికెట్.. పండుగ స్పెషల్ బస్సుల్లో రూ.400 వరకు చేరిందని ప్రయాణికులు చెబుతున్నారు. సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లోనూ రూ.100 నుంచి రూ.150 వరకు అదనపు భారం పడుతోందని వాపోతున్నారు. వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, నల్గొండ తదితర రూట్లలోనూ ఇదే పరిస్థితి ఉందని ఆరోపిస్తున్నారు.

**'1.50' పేరుతో వడ్డింపు**

తిరుగు ప్రయాణంలో బస్సులు ఖాళీగా వచ్చే పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని '1.50' నిబంధనను అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ అదనపు ఛార్జీల భారం ప్రయాణికులపైనే పడటంపై విమర్శలు వస్తున్నాయి. పండుగ రద్దీ ఉన్న సమయంలో తప్పనిసరి పరిస్థితుల్లో స్పెషల్ బస్సు ఎక్కుతున్న వారికి ఈ వసూళ్లు మరింత భారంగా మారుతున్నాయి.

**బస్సెక్కాకే అసలు షాక్**

స్పెషల్ బస్సులకు అదనపు ఛార్జీలు వర్తిస్తాయన్న విషయాన్ని బస్టాండ్లు, టికెట్ కౌంటర్ల వద్ద స్పష్టంగా తెలియజేయడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. బస్సు ఎక్కిన తర్వాత కండక్టర్ అధిక ఛార్జీ అడగడంతో ప్రయాణికులు అవాక్కవుతున్నారు. ముందే సమాచారం ఇవ్వకుండా అదనపు మొత్తం ఎలా చెల్లించాలని ప్రశ్నించడంతో పలుచోట్ల వాగ్వాదాలు చోటుచేసుకుంటున్నాయి.

**పాసులకూ 'పండుగ' వసూళ్లేనా.?**

స్పెషల్ సర్వీసుల్లో జర్నలిస్టులకు అందాల్సిన రాయితీల అమలుపైనా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం రాష్ట్ర, జిల్లా జర్నలిస్టులకు 1/3 వంతు కాన్సెషన్ ఉండాల్సి ఉన్నప్పటికీ స్పెషల్ బస్సుల్లో అది అమలు కావడం లేదని జర్నలిస్టులు ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే 'ఉన్నతాధికారుల ఆదేశాలు' అంటూ సిబ్బంది సమాధానం ఇస్తున్నారని చెబుతున్నారు.

**'మహాలక్ష్మి' రద్దీ.. స్పెషల్ బాదుడు**

మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం కొనసాగుతుండటంతో ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు కిక్కిరిసి నడుస్తున్నాయి. కుటుంబ సమేతంగా ప్రయాణించే పురుషులు, ఇతర ప్రయాణికులకు సీట్లు దొరకడం కష్టంగా మారుతోంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో స్పెషల్ బస్సులను ఆశ్రయిస్తే అదనపు ఛార్జీల భారం మోయాల్సి వస్తోందని ప్రయాణికులు మండిపడుతున్నారు.పండుగ రద్దీ.. ప్రయాణికుల అవసరం.. స్పెషల్ బస్సుల పేరుతో అదనపు వసూళ్లు.రాఖీ వేళ అన్నాచెల్లెళ్లను కలిపే ప్రయాణం.. ఆర్టీసీ అదనపు ఛార్జీలతో సామాన్యుడి జేబుకు మాత్రం చిల్లులు పెడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



## రాయదుర్గం భూమికి దిమ్మతిరిగే ధర

- ఎకరా రూ.269 కోట్లు.. మరోసారి ఆల్‌టైమ్ రికార్డు
- 5.38 ఎకరాలు రూ.1,447 కోట్లకు కొనుగోలు చేసిన వంశీరాం బిల్డర్స్
- వారంలో 10.63 ఎకరాలు.. ప్రభుత్వ ఖజానాకు రూ.2,833 కోట్ల ఆదాయం
- ఐటీ కారిడార్‌లో భూములకు పెరుగుతున్న డిమాండ్‌తో కొత్త రికార్డులు

**ప్రజా వాయిస్,హైదరాబాద్:** హైదరాబాద్ భూముల ధరలకు హద్దే లేకుండా పోతోంది. ఐటీ కారిడార్‌లో అడుగు భూమి దొరకడమే గగనమవుతుండగా.. దొరికిన చోట ధరలు మాత్రం ఆకాశాన్ని దాటుతున్నాయి. రాయదుర్గం,పాన్‌మక్తా ప్రాంతంలో తాజాగా నమోదైన భూమి ధర రియల్ ఎస్టేట్ వర్గాలను విస్మయానికి గురిచేసింది. ఒక్క ఎకరా రూ.269 కోట్లు! టీజీఐఐసీ నిర్వహించిన భూముల వేలంలో ఈ ధర పలకడంతో మరోసారి రికార్డు బద్దలైంది.పాన్‌మక్తాలోని ప్లాట్–P2కు నిర్వహించిన వేలంలో 5.38 ఎకరాల స్థలాన్ని వంశీరాం బిల్డర్స్ రూ.1,447.22 కోట్లకు దక్కించుకుంది. అంటే ఎకరాకు రూ.269 కోట్ల చొప్పున ధర పలికింది. రిజర్వు ధరతో పోలిస్తే సుమారు 52.3 శాతం అధికంగా బిడ్డింగ్ జరిగింది.

**వారం రోజుల్లో రూ.2,833 కోట్ల వసూళ్లు**

ఇదే ప్రాంతంలోని ప్లాట్–P1కు అంతకుముందు జరిగిన వేలంలో ఎకరా రూ.264 కోట్ల ధర నమోదైంది. 5.25 ఎకరాల స్థలం ద్వారా ప్రభుత్వానికి రూ.1,386 కోట్ల ఆదాయం సమకూరింది. తాజాగా P2తో కలిపి 10.63 ఎకరాల భూమి రూ.2,833.22 కోట్లకు అమ్ముడైంది. ఎకరాకు సగటున రూ.266.53 కోట్ల ధర నమోదైంది.

**ఐటీ కారిడార్.. పెట్టుబడుల హాట్‌స్పాట్**

రాయదుర్గం ప్రాంతంలో భూముల కోసం పోటీపడుతున్న పెట్టుబడిదారుల ఆసక్తికి వరుస వేలాలే నిదర్శనం. ఐటీ, వాణిజ్య సంస్థలు, భారీ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు అనుకూలమైన ప్రాంతం కావడంతో ఈ కారిడార్‌లో భూములకు డిమాండ్ మరింత పెరుగుతోంది. హైదరాబాద్ అంతర్జాతీయ నగరంగా విస్తరిస్తుండటంతో భూమి ధరలు కొత్త శిఖరాలను తాకుతున్నాయి.భూమి ఎకరా రూ.269 కోట్లు పలకడం.. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ దూకుడుకు మరో తిరుగులేని సంకేతంగా మారింది.

## ర్యాలీకి వెళ్లారు.. సస్పెండ్ అయ్యారు

**ప్రజా వాయిస్, డెస్క్:** ఆర్ఎస్ఎస్ నిర్వహించిన 'పథ సంచలన' కార్యక్రమంలో పాల్గొన్న ఇద్దరు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులపై కర్ణాటక విద్యాశాఖ చర్యలు తీసుకుంది. యాద్గిర్ జిల్లాకు చెందిన గురురాజ్ జోషి, అన్నాసాహెబ్ దేశ్‌ముఖ్‌లను సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నిబంధనలకు విరుద్ధంగా ఆర్ఎస్ఎస్ కార్యక్రమంలో పాల్గొన్నారనే కారణంతో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

**ఫిర్యాదుతో నోటీసులు**

అంబేద్కర్ స్వాభిమాని సేన చేసిన ఫిర్యాదు నేపథ్యంలో ఇద్దరు ఉపాధ్యాయులకు విద్యాశాఖ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీలు లేదా రాజకీయ ప్రాధాన్యత కలిగిన సంస్థల కార్యక్రమాల్లో పాల్గొనరాదని కర్ణాటక సివిల్ సర్వీసెస్ (ప్రవర్తనా) నిబంధనలు–2021 పేర్కొంటున్నాయని అధికారులు తెలిపారు.

**టీచర్ల వివరణ బేఖాతర్**

తాము పాల్గొన్న కార్యక్రమం ఆదివారం సెలవు రోజున జరిగిందని, పాఠశాల విధులకు ఎలాంటి ఆటంకం కలగలేదని ఉపాధ్యాయులు వివరణ ఇచ్చారు. ఆర్ఎస్ఎస్ కార్యక్రమం రాజకీయపరమైనది కాదని, సాంస్కృతిక కార్యక్రమంగా మాత్రమే పాల్గొన్నామని పేర్కొన్నారు. అయితే విద్యాశాఖ వారి వివరణను తిరస్కరించి సస్పెన్షన్ వేటు వేసింది.

**విచారణ పూర్తయ్యే వరకు..**

శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు. దీంతో సెలవు రోజున నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులపై నిబంధనల ఉల్లంఘన పేరుతో చర్యలు తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

## మంత్రి పొన్నంకూ ఓటరు నోటీసు

**ప్రజా వాయిస్,హైదరాబాద్:** మంత్రి అయినా.. సామాన్య ఓటరైనా.. ఎన్నికల నిబంధనల ముందు అందరూ సమానమేనని ఎన్నికల యంత్రాంగం స్పష్టం చేసింది. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియలో భాగంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఓటరు వివరాల్లోని తప్పును అధికారులు గుర్తించారు. ఆయన ఓటరు గుర్తింపు కార్డులో తండ్రి పేరు తప్పుగా నమోదై ఉండటాన్ని గుర్తించిన బూత్ స్థాయి అధికారి (BLO) వివరాల సవరణకు నోటీసు జారీ చేశారు.

**తప్పు గుర్తింపు.. నోటీసు జారీ**

SIRలో భాగంగా ఓటర్ల వివరాలను ఇంటింటా, రికార్డుల ఆధారంగా పరిశీలిస్తున్న క్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఓటరు వివరాలను కూడా అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా తండ్రి పేరు నమోదులో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. దీంతో నిబంధనల ప్రకారం వివరణ, ఆధారాలు సమర్పించాలంటూ బీఎల్‌వో నోటీసు ఇచ్చారు.

**వెంటనే స్పందించిన మంత్రి**

అధికారుల నోటీసుపై మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించారు. తండ్రి పేరును సరిచేసేందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అధికారులకు సమర్పించారు. సమర్పించిన ఆధారాలను పరిశీలించిన అనంతరం ఓటరు జాబితా, ఓటరు గుర్తింపు కార్డులో అవసరమైన మార్పులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

**ఎస్ఐఆర్ లో నిశిత పరిశీలన**

ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు, వ్యత్యాసాలు లేకుండా చేయడమే ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ లక్ష్యమని అధికారులు చెబుతున్నారు. ప్రతి ఓటరు వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలిస్తున్నామని, ప్రజాప్రతినిధుల విషయంలోనూ ఇదే విధానం కొనసాగుతుందని స్పష్టం చేస్తున్నారు.

**అందరికీ ఒకే నిబంధన**

మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఓటరు వివరాల్లో తప్పు ఉన్నా.. దానిని సరిచేసే ప్రక్రియలో సాధారణ ఓటరుకు వర్తించే నిబంధనలే వర్తింపజేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా ప్రామాణికతకు ఎన్నికల సంఘం ఇస్తున్న ప్రాధాన్యానికి ఈ ఘటన నిదర్శనంగా నిలిచింది.

## జల వివాదాల్లో 'నో కాంప్రమైజ్'

**మొదటి పేజీ తరువాయి**

విషయంలో రాజీ పడొద్దని సీఎం సూచించారు.

**సుప్రీంకోర్టు కేసులపై ఆరా**

మహారాష్ట్ర, ఏపీతో తెలంగాణకు ఉన్న జల వివాదాలకు సంబంధించిన సుప్రీంకోర్టు కేసుల ప్రస్తుత పరిస్థితిని సీఎం అడిగి తెలుసుకున్నారు. ఆయా కేసుల్లో ఇతర రాష్ట్రాల వాదనలు, తెలంగాణ ఇప్పటివరకు వినిపించిన వాదనలు, ఇకపై అనుసరించాల్సిన వ్యూహంపై వివరాలు తీసుకున్నారు. సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అంశాలపైనా సమీక్షించారు. న్యాయవాదులు, ఇంజినీరింగ్, నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి సాంకేతిక, న్యాయపరమైన ఆధారాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. సుప్రీంకోర్టు నుంచి కేంద్ర జల సంఘం వరకు.. కృష్ణా, గోదావరి బోర్డుల వరకు ప్రతి వేదికపైనా తెలంగాణ వాదన బలహీనపడకుండా సమగ్ర వ్యూహంతో ముందుకు సాగాలని సీఎం స్పష్టం చేశారు.

## సీఎం రేవంత్‌కు రాఖీ.. రాజీ సంకేతమా..?

**మొదటి పేజీ తరువాయి**

శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం కుటుంబ సభ్యులకు కూడా రాఖీలు కట్టారు.

**సురేఖకు 'గోల్డ్' స్పెషల్**

ముఖ్యమంత్రి కోసం ప్రత్యేకంగా బంగారు రాఖీ చేయించి తీసుకొచ్చినట్లు కొండా సురేఖ తెలిపారు. ప్రతీ ఏడాది రేవంత్‌రెడ్డికి రాఖీ కడుతున్నా.. ఈసారి ప్రత్యేకంగా గోల్డ్ రాఖీ కట్టాను' అని చెప్పారు. సీతక్కతో కలిసి వెళ్లి సీఎంకు రాఖీ కట్టామని, రేవంత్‌తో పాటు ఆయన అల్లుడు, మనవడికి కూడా రాఖీలు కట్టినట్లు వెల్లడించారు.

**రాజకీయంగా ప్రాధాన్యం**

ఇటీవల కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్న వేళ.. ఆమె సీఎంకు రాఖీ కట్టడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. పరకాల వివాదం, క్రమశిక్షణ కమిటీ నివేదిక నేపథ్యంలో చోటుచేసుకున్న ఈ పరిణామంపై కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది.సురేఖతో పాటు సీతక్క కూడా సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టడంతో.. ఇది కేవలం పండుగ వేడుకేనా లేక కాంగ్రెస్‌లో ఐక్యతకు సంకేతమా అన్న చర్చ సాగుతోంది. విభేదాలకు తెర పడుతుందా అధిష్ఠానం వద్ద నెలకొన్న అసంతృప్తులు సమసిపోతాయా? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

**సీఎంకు రాఖీలు కట్టిన మహిళలు**

సీఎం నివాసంలో జరిగిన రాఖీ వేడుకల్లో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి , కమిషన్ సభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, బ్రహ్మకుమారీలు, మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. మలక్‌పేట ప్రభుత్వ హైస్కూల్ ఫర్ ది బ్లైండ్ గర్ల్స్ విద్యార్థినులు కూడా ముఖ్యమంత్రికి రాఖీలు కట్టారు.

## 120 మందికి పరీక్షలు.. 12 మందికే న్యాయమా?

**ప్రజా వాయిస్,హైదరాబాద్:** సింగరేణి కార్మికుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటలాడుతోందా అనారోగ్యంతో విధులు నిర్వహించలేని కార్మికులకు అండగా నిలవాల్సిన మెడికల్ బోర్డు ప్రక్రియ.. కేవలం మొక్కుబడి తంతుగా మారిందా? 120 మంది కార్మికులను వైద్య పరీక్షలకు పిలిచి.. అందులో కేవలం 12 మందినే 'అన్‌ఫిట్'గా ప్రకటించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అర్హులైన కార్మికులకు న్యాయం చేయకుండా బోర్డు పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.సింగరేణిలో పనిచేస్తూ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కార్మికులకు, వారి కుటుంబాలకు మెడికల్ అన్‌ఫిట్ ప్రక్రియ అత్యంత కీలకం. వైద్య పరీక్షల్లో అన్‌ఫిట్‌గా తేలితే వారి వారసులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం లభించే అవకాశం ఉంటుంది. దీంతో అనేక కుటుంబాలకు ఇది జీవనాధారంగా మారింది. అలాంటి కీలకమైన ప్రక్రియలో పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులను పిలిచి.. అత్యల్ప సంఖ్యలో మాత్రమే అన్‌ఫిట్‌గా ప్రకటించడంపై కార్మిక వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

**120 మందిలో.. 12 మందేనా.?**

దాదాపు 120 మంది కార్మికులను మెడికల్ బోర్డు పరీక్షలకు పిలిపించారు. అయితే కేవలం 12 మందినే 'అన్‌ఫిట్'గా ప్రకటించారు. అంటే పరీక్షలకు హాజరైన వారిలో పది శాతం మందికే అనారోగ్య కారణాలతో విధులు నిర్వహించలేరని బోర్డు నిర్ధారించినట్లైంది. మిగిలిన కార్మికుల పరిస్థితి ఏమిటన్నది ఇప్పుడు ప్రశ్నగా మారింది. వారు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలను బోర్డు ఏ ప్రాతిపదికన అంచనా వేసిందనే దానిపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**'అన్‌ఫిట్' అయితేనే.. కుటుంబానికి ఉద్యోగం**

అనారోగ్యంతో విధులు నిర్వహించలేని కార్మికులకు మెడికల్ అన్‌ఫిట్ ప్రక్రియ కీలకం. అన్‌ఫిట్‌గా గుర్తిస్తే నిబంధనల మేరకు వారి వారసులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం లభించే అవకాశం ఉంటుంది. దీంతో కార్మికుడి ఆరోగ్య పరిస్థితితోపాటు కుటుంబ భవిష్యత్తు కూడా ఈ బోర్డు నిర్ణయంపై ఆధారపడి



ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో పరీక్షల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగాల్సిన అవసరం ఉంది.

**కవిత మండిపాటు**


మెడికల్ బోర్డు ప్రక్రియను ప్రభుత్వం మొక్కుబడిగా నిర్వహించిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సింగరేణి కార్మికుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. దాదాపు 120 మందిని పరీక్షలకు పిలిచి కేవలం 12 మందినే అన్‌ఫిట్‌గా ప్రకటించడం దారుణమన్నారు.అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు, వారి కుటుంబాలకు అండగా నిలవాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి కార్మికుడినీ వెంటనే అన్‌ఫిట్‌గా గుర్తించి.. వారి వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

**హక్కులు కాలరాస్తే.. గుణపాఠం తప్పదు**

కార్మికుల హక్కులను కాలరాస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి కార్మిక క్షేత్రంలో తగిన గుణపాఠం తప్పదని కవిత హెచ్చరించారు. మెడికల్ బోర్డు నిర్ణయాలపై సమగ్రంగా సమీక్ష జరిపి.. అర్హులైన కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.కార్మికుడి ఆరోగ్యం.. కుటుంబం భవిష్యత్తు.. రెండూ ముడిపడి ఉన్న ఈ వ్యవహారంలో '12 మందికే అన్‌ఫిట్' నిర్ణయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## తెలంగాణలో క్రైమ్ అలర్ట్..!

మొదటి పేజీ తరువాయి



**తీవ్ర నేరాల్లో తగ్గుదల**

2024–25లో 7,019గా నమోదైన తీవ్ర నేరాలు 2025–26లో 6,294కు తగ్గాయి. దీంతో ఏడాది వ్యవధిలో 10.33 శాతం తగ్గుదల నమోదైంది. లక్ష జనాభాకు తీవ్ర నేరాల రేటు 11.21 నుంచి 10.88కు పడిపోయింది. అయితే కొన్ని జిల్లాల్లో మాత్రం తీవ్ర నేరాలు పెరిగాయి. ములుగులో 44 నుంచి 88కు, నిర్మల్‌లో 66 నుంచి 102కు, ఆదిలాబాద్‌లో 96 నుంచి 140కు చేరాయి. ఈ జిల్లాల్లో పెరుగుతున్న తీవ్ర నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

**నేరాలపై లోతైన విశ్లేషణ**

హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అర్ధవార్షిక నేర సమీక్షలో డీజీపీ సీవీ ఆనంద్ నేర గణాంకాలను పరిశీలించారు. ప్రతి నేరం వెనుక ఉన్న కారణాలు, నేరస్తుల విధానం, దర్యాప్తు తీరు, కేసుల పరిష్కారాన్ని లోతుగా విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు. దర్యాప్తులో వృత్తి నైపుణ్య ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

**96 శాతానికి సీసీటీఎన్ఎస్ డేటా**

సీసీటీఎన్ఎస్ డేటా అప్‌డేట్‌పై ప్రత్యేక దృష్టి సారించడంతో గతంలో 70–80 శాతంగా ఉన్న డేటా అప్‌డేట్ ప్రస్తుతం 96 శాతానికి చేరిందని డీజీపీ తెలిపారు. అధికారులు, సిబ్బంది కృషిని అభినందించారు. ప్రతి నెల నిర్వహించే క్రైమ్ రివ్యూ సమావేశాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

**ముందస్తు వ్యూహంతో నియంత్రణ**

నేరాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే.. నేర ధోరణిని ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని డీజీపీ సూచించారు. క్షేత్రస్థాయిలో పోలీసులు పాటించాల్సిన విధానాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. జోన్ల డీఐజీలు, మల్టీజోన్ ఐజీలు ఇన్‌స్పెక్షన్ నోట్స్‌ను పరిశీలించి లోపాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సైబర్, ఆర్థిక నేరాల్లో నమోదైన తగ్గుదలను కొనసాగిస్తూ.. నేర నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగించాలని సూచించారు.

## జల విలయం.. కన్నీటి ప్రవాహం

**మొదటి పేజీ తరువాయి**

చేరుకున్న 21 మంది భారతీయులను కేంద్ర మంత్రి ఎస్. జైశంకర్ కలిశారు. భారతీయుల రక్షణకు సహకరిస్తున్న నేపాల్ ప్రభుత్వం, ఆర్మీకి కృతజ్ఞతలు తెలిపారు. అవసరమైతే టన్నెల్, వంతెనల నిర్మాణ నిపుణులు, వైద్య బృందాలు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపేందుకు భారత్ సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే 10 టన్నుల మానవతా సాయాన్ని నేపాల్‌కు పంపినట్లు వెల్లడించారు.

**మళ్లీ వరద ముప్పు**

ఇప్పటికే వరదలతో విలవిల్లాడుతున్న నేపాల్‌కు మరో ముప్పు పొంచి ఉంది. ప్రభావిత ప్రాంతాల్లో నీటిమట్టం మరోసారి పెరుగుతోందని అధికారులు హెచ్చరించారు. టిబెట్ వైపున్న ఓ డ్యామ్ మరోసారి బద్దలైనట్లు సమాచారం రావడంతో నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.

**హిమనదం బద్దలవడంతోనే..**

ఎత్తైన మంచుకొండ ప్రాంతంలో హిమనదం బద్దలై భారీగా మట్టి, నీరు దిగువకు ప్రవహించడంతోనే ఈ స్థాయిలో వరదలు సంభవించాయని చైనా తెలిపింది. విపత్తుకు కారణాలపై నేపాల్, చైనా సంస్థలు విశ్లేషణ చేపట్టాయి.

**విదేశీ బలగాలకు పరిమిత అవకాశం**

2015 భూకంపం తర్వాత అత్యంత తీవ్రమైన విపత్తును ఎదుర్కొంటున్న నేపాల్.. విదేశీ రెస్క్యూ బలగాల సాయంపై ఆచితూచి వ్యవహరిస్తోంది. ప్రస్తుతం తమ బలగాలే సహాయక చర్యలను నిర్వహించగలవని తెలిపింది. ప్రత్యేక పరిస్థితుల్లో అంతర్జాతీయ నిపుణుల సహాయం తీసుకుంటామని స్పష్టం చేసింది.



# డ్యూటీ డాక్టర్ డుమ్మా.. మంత్రి ఫైర్

- జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో ప్రైవేట్ డాక్టర్‌తో వైద్యం
- ప్రజా వాయిస్ కథనంపై స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ
- హెల్త్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్‌తో మంత్రి ఆరా
- ఆస్పత్రిలో జరిగిన ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశం
- డ్యూటీ డాక్టర్ స్థానంలో ప్రైవేట్ వైద్యుడి వ్యవహారంపై ఆగ్రహం
- బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం



**ప్రజా వాయిస్, సంగారెడ్డి:** జహీరాబాద్ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్ గైర్హాజరు కావడం, ఆయన స్థానంలో ప్రైవేట్ వైద్యుడు చికిత్స అందించిన ఘటనపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో వైద్యుల కొరత, డ్యూటీ డాక్టర్ గైర్హాజరు, ప్రైవేట్ డాక్టర్‌తో చికిత్స అంశాలపై 'ప్రజా వాయిస్'లో ప్రచురితమైన కథనంపై మంత్రి స్పందించారు.ఈ వ్యవహారంపై రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్. చొంగ్తు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో మంత్రి మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో జరిగిన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహించాల్సిన డ్యూటీ డాక్టర్ స్థానంలో ప్రైవేట్ వైద్యుడు ఉండటంపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# సుల్తానాబాద్ లో పేరుకుపోతున్న చెత్త కుప్పలు

- పారిశుధ్యం పడకేసింది.. దుర్వాసనతో జనం ఉక్కిరిబిక్కిరి
- పేరుకుపోతున్న చెత్త కుప్పలు.. పట్టించుకోని అధికారులు
- సిబ్బంది, వాహనాలున్నా కనిపించని పారిశుధ్య నిర్వహణ
- దోమల విజృంభణతో డెంగ్యూపై ప్రజల్లో భయం
- ప్రజారోగ్యంపై పెరుగుతున్న ఆందోళన
- తక్షణమే చెత్త తొలగించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్




**ప్రజా వాయిస్, సుల్తానాబాద్:** సుల్తానాబాద్ పట్టణంలో పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా మారుతున్నాయి. పలు ప్రాంతాల్లో రోజుల తరబడి చెత్త కుప్పలు పేరుకుపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త నుంచి వెలువడుతున్న దుర్వాసనకు తోడు దోమలు, ఈగలు పెరుగుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

**ఎక్కడ చూసినా చెత్తే..**

ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు, ఖాళీ స్థలాలు, నివాస ప్రాంతాల సమీపంలో చెత్త పేరుకుపోయింది. సకాలంలో చెత్త తరలించకపోవడంతో కుక్కలు, పందులు చెత్తను చెల్లాచెదురు చేస్తున్నాయి. కొన్ని చోట్ల డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోవడంతో మురుగునీటి పారుదలకూ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

**సిబ్బంది ఉన్నా.. ఫలితం శూన్యం**

మున్సిపాలిటీలో పారిశుధ్య సిబ్బంది, చెత్త తరలింపు వాహనాలు ఉన్నప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రోజువారీగా చెత్త సేకరణ, తరలింపు, వీధుల శుభ్రతపై అధికారులు పర్యవేక్షణ పెంచాలని కోరుతున్నారు.

**డెంగ్యూపై దడ..**

చెత్త కుప్పలు, నిల్వ నీటితో దోమలు వృద్ధి చెందే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో డెంగ్యూ, ఇతర విషజ్వరాలపై ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు నివసించే ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**అధికారులు స్పందించాలి**

చెత్త పేరుకుపోయిన తర్వాత హడావుడిగా శుభ్రం చేయడం కాకుండా నిరంతర పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను పరిష్కరించాలని, చెత్తను సకాలంలో తరలించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# హాస్టల్ పక్కనే పెట్రోల్ బంక్..!

- నేలకొండపల్లిలో స్త్రీశక్తి బంక్ ఏర్పాటుపై అభ్యంతరాలు
- బీసీ హాస్టల్‌లో 100 మందికిపైగా విద్యార్థులు
- ప్రధాన రహదారి పక్కనే ఏర్పాటుకు సన్నాహాలు
- భద్రత, ఆరోగ్యంపై తల్లిదండ్రుల్లో ఆందోళన
- కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం వినియోగంపై ప్రశ్నలు
- ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినా స్పందన లేదని ఆరోపణలు

**ప్రజా వాయిస్,ఖమ్మం :** నేలకొండపల్లిలో పెట్రోల్ బంక్ ఏర్పాటుపై వివాదం నెలకొంది. ప్రధాన రహదారి పక్కనే, వంద మందికిపైగా విద్యార్థులు నివసించే ప్రభుత్వ బీసీ హాస్టల్‌కు సమీపంలో స్త్రీశక్తి పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడంపై స్థానికులు, ప్రజా సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. విద్యార్థుల భద్రత, ప్రజల ఆరోగ్యం, భవిష్యత్ ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదిత స్థలాన్ని మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.బంక్ ఏర్పాటుతో పెట్రోల్, డీజిల్ వాసనలు, అగ్నిప్రమాదాల ముప్పు విద్యార్థులకు ఇబ్బందిగా మారే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిపై ఇంధనం కోసం వాహనాలు నిలిచే పరిస్థితి ఏర్పడితే ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాల ముప్పు పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

**ప్రజావాణిలో ఫిర్యాదులు.. అయినా.?**

బంక్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ జిల్లా కలెక్టరేట్, మండల ప్రజావాణిలో పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా అధికారుల నుంచి సరైన స్పందన రాలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వానికి విలువైన స్థలాన్ని దీర్ఘకాలికంగా బంక్ కోసం వినియోగించడం కంటే భవిష్యత్ ప్రజా అవసరాలకు కేటాయించాలని కోరుతున్నారు.

**శివారుకు తరలించాలని డిమాండ్**

స్త్రీశక్తి పథకానికి తాము వ్యతిరేకం కాదని, అయితే విద్యార్థుల హాస్టళ్లు, జనావాసాలకు దూరంగా గ్రామ శివారులో బంక్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. విద్యార్థుల భద్రత, ప్రజల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని అధికారులు వెంటనే నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరిస్తున్నారు.





# సీతారామ నీళ్లలో.. భద్రాద్రికి వాటా ఏదీ.?

- గోదావరి నీళ్లు అందక భద్రాద్రి రైతుల్లో అసంతృప్తి
- మూడు చెరువులు నింపి సింగభూపాలెం చెరువుకు నీరు తరలించాలి
- డిస్ట్రిబ్యూటరీలు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి
- బూర్గంపాడు, అశ్వారావుపేట, ఇల్లెందు, భద్రాచలం ప్రాంతాలకూ నీరందాలి
- రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా: కూనంనేని

**ప్రజా వాయిస్,జూలూరుపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని మండలాలకు సీతారామ కెనాల్ ద్వారా గోదావరి జలాలను అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు డిమాండ్ చేశారు. శుక్రవారం జూలూరుపాడు మండలం వినోబానగర్ సమీపంలోని రాజీవ్ లింకు కెనాల్‌ను సీపీఐ, రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. అధికారులతో మాట్లాడి నీటి సరఫరా పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు.సీతారామ కెనాల్ నిర్మాణంతో భద్రాద్రి జిల్లాలోని పలువురు రైతులు భూములు కోల్పోయారని, అయినా తమ ప్రాంత రైతులకు గోదావరి జలాలు అందకపోవడం బాధాకరమన్నారు. ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు తరలించడంపై తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. అయితే భద్రాద్రి జిల్లాలోని రైతులకు కూడా సాగునీరు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.జూలూరుపాడు మండలంలోని కప్పలకుంట, శనగచెరువు, దండాలచెరువుల్లో నీటిని నింపి.. అక్కడి నుంచి సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువుకు గోదావరి జలాలను తరలించాలని సూచించారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణం పూర్తయ్యేందుకు మరో ఏడాది పట్టే అవకాశం ఉన్నందున, అప్పటి వరకు ప్రత్యామ్నాయ మార్గంలో నీటిని అందించాలని కోరారు.బూర్గంపాడు, అశ్వారావుపేట, ఇల్లెందు, భద్రాచలం తదితర ప్రాంతాల రైతులకు గోదావరి జలాలు అందేలా ప్రత్యేక రెగ్యులేటర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈ సమస్యను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.రైతుల సాగునీటి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి గోదావరి జలాలు అందేలా తనవంతు కృషి చేస్తానని కూనంనేని తెలిపారు.కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సబీర్‌పాషా, కొత్తగూడెం మేయర్ మూడు గణేష్, సీతారామ ఈఈ మహేశ్వరరావు, డీఈ చంద్రశేఖర్, ఏఈ శ్రావణి, సుజాతనగర్ ఎంపీడీవో భారతి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్రకుమార్, సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# గోమాతలతో రక్ష బంధన్..

- పాలకుర్తిలో వినూత్న వేడుకలు
- పెంపుడు గోవులకు రాఖీలు కట్టిన కుటుంబం
- వేదమంత్రాల మధ్య ప్రత్యేక పూజలు
- గోవులకు తిలకం దిద్ది దీపహారతి అరటి పండ్లు, ఆకుకూరలతో విందు
- మూగ జీవులపై ప్రేమాభిమానాలు చాటుకున్న దేవగిరి భార్గవి కుటుంబం

**ప్రజా వాయిస్/పాలకుర్తి** (జనగామ జిల్లా)రక్షాబంధన్ వేడుకలను జనగామ జిల్లా పాలకుర్తిలో ఓ కుటుంబం వినూత్నంగా నిర్వహించింది. మండల కేంద్రంలోని గోశాలలో తమ పెంపుడు గోవులను కుటుంబ సభ్యులుగా భావిస్తూ రాఖీలు కట్టి రక్షా బంధన్ వేడుకలు జరిపారు. దేవగిరి భార్గవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్చకులు వేదమంత్రాలు పఠిస్తుండగా గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవులకు తిలకం దిద్ది, రాఖీలు కట్టి, దీప హారతి ఇచ్చారు.సంప్రదాయ రీతిలో పూజలు నిర్వహించిన అనంతరం గోవులకు ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. సీట్లకు బదులుగా అరటి పండ్లు, ఆకుకూరలతో గోవులకు ఆహారం అందించారు. గోమాత లను కేవలం పశువులు గా కాకుండా కుటుంబ సభ్యులుగా భావిస్తూ ఈ వేడుకలు నిర్వహించడం అందరినీ ఆకట్టుకుంది.రక్షా బంధన్ పండుగ లోని ప్రేమ, ఆప్యాయతల కు జీవ కారుణ్యాన్ని జోడిస్తూ మూగ జీవులపై తమకున్న ప్రేమాభిమానాలను ఈ కుటుంబం చాటుకుంది. గోవుల సంరక్షణ, జీవ కారుణ్యం పట్ల సమాజంలో అవగాహన పెంచాలనే సందేశాన్ని ఈ వినూత్న వేడుక అందించింది. సంప్రదాయానికి జీవ కారుణ్యాన్ని జోడించిన ఈ రక్షా బంధన్ వేడుకలు పాలకుర్తిలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# రాలిప్రోలో గంజాయి గుట్టు రట్టు

- పరిశ్రమలో 2 కిలోల ఎండు గంజాయి లభ్యం
- ప్రజావాయిస్ కథనం నిజమేనని తేల్చిన ఎక్సైజ్ అధికారులు

**ప్రజావాయిస్,సంగారెడ్డి:** హత్నూరు మండలం చందాపూర్ పారిశ్రామిక ప్రాంతంలోని పరిశ్రమల్లో గంజాయి విక్రయాలు సాగుతున్నాయన్న ప్రజావాయిస్ కథనం వాస్తవమని ఎక్సైజ్ అధికారుల తనిఖీలతో తేలింది. చందాపూర్‌లోని రాలిప్రో పరిశ్రమలో రెండు కిలోల ఎండు గంజాయి లభించినట్లు జోగిపేట ఎక్సైజ్ అధికారులు నిర్ధారించారు. పరిశ్రమ యాజమాన్యం, హెచ్‌వోడీలు తమ సంస్థల్లో అలాంటి వ్యవహారాలేమీ లేవని గతంలో ఖండించినప్పటికీ.. అధికారుల తనిఖీల్లో గంజాయి వ్యవహారం వెలుగుచూడటం చర్చనీయాంశంగా మారింది.జోగిపేట ఎక్సైజ్ సీఐ ఆధ్వర్యంలో శుక్రవారం సిబ్బంది పరిశ్రమలో తనిఖీలు చేపట్టగా.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ కార్మికుడు గంజాయి తీసుకువచ్చినట్లు నిర్ధారణకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అయితే సంబంధిత కార్మికుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు సమాచారం అందించామని, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ స్పష్టం చేశారు.



# హైవే విస్తరణ.. గ్రామానికి దారేది..?

- ఎన్‌హెచ్-563 పనులతో మూసుకుపోయిన అనుసంధాన మార్గాలు
- దారి కోసం గ్రామస్తుల ధర్నా, రాస్తారోకో
- వ్యవసాయానికి వెళ్లాలన్నా.. ఆస్పత్రికి చేరాలన్నా అవస్థలే
- 108, డయల్-100 వస్తాయా? అంటూ ఆందోళన
- ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు చేయాలని డిమాండ్



**ప్రజా వాయిస్, ఎల్కతుర్తి:** అభివృద్ధి కోసం చేపట్టిన జాతీయ రహదారి విస్తరణ పనులు.. కోతులనడుమ గ్రామ ప్రజలకు కష్టాలు తెచ్చి పెట్టాయి. హనుమకొండ–హుజురాబాద్ జాతీయ రహదారి–563 విస్తరణలో భాగంగా గ్రామానికి ఉన్న అనుసంధాన మార్గాలు మూసుకుపోవడంతో రాకపోకలు స్తంభించాయి. హనుమకొండ వైపు నుంచి రావాలన్నా.. హుజురాబాద్ వైపు వెళ్లాలన్నా సరైన దారి లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు చేయకుండానే పనులు కొనసాగించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గ్రామస్తులు ధర్నా, రాస్తారోకో చేపట్టారు.

**రైతులకు పొలం దారిలేదు**

గ్రామ రైతులు వ్యవసాయ భూములకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు పొలాలకు తరలించడం కష్టంగా మారింది. పంటలను తరలించే సమయంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**గొర్రెలు మేపేందుకూ ఇక్కట్లే**

గొల్లకురుమలు గొర్రెలను మేతకు తీసుకెళ్లేందుకు దారి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు పశువులను పొలాలకు తీసుకెళ్లడమూ కష్టంగా మారింది. హైవే పనులతో గ్రామీణ మార్గాలు మూసుకుపోవడంతో జీవనోపాధిపైనా ప్రభావం పడుతోంది.

**హుజురాబాద్ వెళ్లాలంటే చుట్టూ తిరగాల్సిందే**

విద్య, వైద్యం, నిత్యావసరాలు, ఎరువుల కోసం హుజురాబాద్‌కు వెళ్లే గ్రామస్తులు సరైన అనుసంధాన మార్గం లేక చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.

**అత్యవసర సేవల పరిస్థితి ఏంటి.?**

గ్రామంలో అనారోగ్యానికి గురైన వారికి 108 అంబులెన్స్ సకాలంలో చేరుతుందా? అత్యవసర పరిస్థితుల్లో డయల్–100 పోలీసులు ఎలా వస్తారు? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ప్రాణాపాయ సమయంలో ఒక్క నిమిషం కీలకమైనప్పటికీ గ్రామానికి చేరుకునే దారే లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలి**

గ్రామ సర్పంచ్ మాట్ల లింగయ్య మాట్లాడారు.. జాతీయ రహదారి విస్తరణ అవసరమే అయినా గ్రామ ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగేలా పనులు చేపట్టడం సరికాదన్నారు. సర్వీస్ రోడ్డు, అండర్‌పాస్, ప్రత్యామ్నాయ అనుసంధాన మార్గం ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను డిమాండ్ చేశారు.హైవే పనులు కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించి గ్రామానికి శాశ్వత రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. హైవే పక్కనే ఉన్నాం.. మా గ్రామానికి దారేది. అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# రాఖీ పండుగ వేడుకలు ఘనం



**ప్రజావాయిస్/వికారాబాద్:** జిల్లాలో రాఖీ పండుగ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. తోబుట్టువులు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి ఆప్యాయతను చాటుకున్నారు. అన్నదమ్ములు సోదరీమణులకు కానుకలు అందించి, వారి క్షేమం కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పండుగ సందర్భంగా ఇళ్లలో సందడి నెలకొంది.




# కీసరగుట్టలో బాలీవుడ్ బ్యూటీ సందడి

- స్వామివారిని దర్శించుకున్న అజయ్ దేవగణ్ కుమార్తె నీసా దేవగణ్
- ప్రత్యేక పూజలు.. వేద పండితుల ఆశీర్వచనం
- భక్తులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సందడి
- తీర్థప్రసాదాలు అందజేసిన ఆలయ చైర్మన్, ఈవో



**ప్రజావాయిస్,కీసర:** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామివారిని బాలీవుడ్ ప్రముఖ నటుడు అజయ్ దేవగణ్ కుమార్తె నీసా దేవగణ్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు, వేద పండితులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలోని మూల విరాట్ స్వామివారికి నీసా దేవగణ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.నీసా దేవగణ్ కీసరగుట్టకు రావడంతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది. ఆమెను చూసేందుకు పలువురు భక్తులు ఆసక్తి చూపారు. దర్శనం అనంతరం ఆలయ చైర్మన్ తాటకం వెంకటేశ శర్మ, ఈవో సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు ఆమెకు ఆశీర్వచనం అందించారు. స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త తాటకం నారాయణ శర్మ తదితరులు పాల్గొన్నారు.



# పిట్లంలో నకిలీ నోట్ల ముఠా అరెస్ట్

- రూ.91 వేల దొంగ కరెన్సీ స్వాధీనం
- మహారాష్ట్రకు చెందిన ముగ్గురి అరెస్ట్

**ప్రజా వాయిస్,బాన్సువాడ:** కామారెడ్డి జిల్లాలో నకిలీ కరెన్సీ నోట్లను చలామణి చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును పిట్లం పోలీసులు రట్టు చేశారు. మహారాష్ట్రకు చెందిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.91 వేల విలువైన నకిలీ నోట్లు, కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.ఈ నెల 26న పిట్లం మండల కేంద్రంలోని ఓ పెట్రోల్ బంక్‌లో కారులో వచ్చిన ముగ్గురు వ్యక్తులు పెట్రోల్ పోయించుకుని రూ.500 నకిలీ నోట్లను అందించినట్లు పోలీసులు తెలిపారు. నోట్లు అనుమానాస్పదంగా ఉండటాన్ని గుర్తించిన క్యాషియర్ వారిని ప్రశ్నించడంతో నిందితులు అక్కడి నుంచి కారులో పరారయ్యారు. విషయం పోలీసులకు తెలియడంతో ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు.కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి, సీఐ తిరుపతయ్య, ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి ముగ్గురిని పట్టుకున్నారు. మహారాష్ట్రకు చెందిన రాహుల్‌రావు, భీమ్‌శంకర్ రామారావు, ప్రతీ జనాబ్‌లను అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

# మార్చురీలో మృతదేహానికీ రక్షణ ఏది..?


- దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్లక్ష్యంపై బంధువుల ఆగ్రహం
- గుండెపోటుతో మృతిచెందిన వ్యక్తి మృతదేహంపై ముఖం, కంటి కింద తీవ్ర గాయం.. రక్తస్రావం
- మరుసటి రోజు పోస్టుమార్టం కోసం వచ్చిన బంధువులకు కనిపించిన వైనం
- సిబ్బంది సమాధానంపై అసంతృప్తి



**ప్రజావాయిస్,దేవరకొండ:** ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందే రోగుల భద్రతపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ.. మార్చురీలో భద్రపరిచిన మృతదేహానికే గాయాలు కావడం కలకలం రేపింది. కొండమల్లేపల్లి పట్టణంలోని నల్గొండ రోడ్డు, పాత ఊరు కాలనీకి చెందిన పసునూరి అనిల్‌కుమార్ గుండెపోటుతో మృతిచెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.పోస్టుమార్టం మరుసటి రోజు నిర్వహిస్తామని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో బంధువులు మరుసటి రోజు ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించగా.. అనిల్‌కుమార్ ముఖంపై, ముఖ్యంగా కంటి కింద భాగంలో తీవ్ర గాయం ఉండటంతో పాటు రక్తస్రావం జరిగినట్లు గుర్తించారు. దీంతో వారు ఆసుపత్రి సిబ్బందిని ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వలేదని బంధువులు ఆరోపించారు.గుండెపోటుతో మృతిచెందిన వ్యక్తి మృతదేహానికే ఇలా గాయాలు కావడంపై కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రి మార్చురీలో మృతదేహాల భద్రతపై అధికారులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. మృతదేహానికే రక్షణ లేకపోతే.. చికిత్స కోసం వచ్చే రోగుల పరిస్థితి ఏంటంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# పదవుల పందేరం.. కాంగ్రెస్‌లో అసంతృప్తి సెగ!

- పార్టీ కష్టకాలంలో జెండా మోసిన వారికి మొండిచేయి
- వలస నేతలకే పెద్దపీట?
- ఒరిజినల్ కాంగ్రెస్' వర్సెస్ 'వలస కాంగ్రెస్'గా మారుతున్న రాజకీయాలు
- నామినేటెడ్ పదవుల కేటాయింపుపై సీనియర్ల గుర్రు
- వర్గపోరుతో వేడెక్కుతున్న జిల్లా రాజకీయం
- రాబోయే స్థానిక ఎన్నికల వేళ అధిష్టానానికి కొత్త తలనొప్పి




**ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:** వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల కేటాయింపు అంతర్గత విభేదాలకు, అసంతృప్తికి దారితీస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అధికారం కోసం ఎదురుచూసిన కాలంలో పార్టీని నమ్ముకుని పనిచేసిన సీనియర్ నాయకులు, కార్యకర్తలను పక్కనపెట్టి.. ఇటీవల ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన నాయకుల అనుచరులకు కీలక పదవులు దక్కుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మున్సిపల్ చైర్మన్ పదవులు, మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులు, రాష్ట్ర స్థాయి కమిటీల్లో సభ్యత్వాలు, జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వంటి కీలక నియామకాల విషయంలో పాత కాంగ్రెస్ శ్రేణులకు ఆశించిన ప్రాధాన్యం దక్కలేదనే అసంతృప్తి కొందరు నాయకులు, కార్యకర్తల్లో వ్యక్తమవుతున్నట్లు సమాచారం.

**నియోజకవర్గాల్లో గ్రూపుల పోరు**

వికారాబాద్ నియోజకవర్గంలోనూ పార్టీ అంతర్గతంగా వర్గ విభేదాలు ఉన్నాయనే ప్రచారం రాజకీయ వర్గాల్లో సాగుతోంది. స్థానిక ప్రజాప్రతినిధుల వర్గాలు, ముఖ్యమంత్రి అనుచర వర్గాల మధ్య ఆధిపత్య పోరు పార్టీ కార్యక్రమాలపై ప్రభావం చూపుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**తాండూరులోనూ అదే పరిస్థితి?**

తాండూరు మున్సిపాలిటీతో పాటు మార్కెట్ కమిటీ వ్యవహారాల్లోనూ పాత, కొత్త కాంగ్రెస్ నేతల మధ్య ఆధిపత్య పోరు కనిపిస్తోందనే చర్చ ఉంది. పదవుల కేటాయింపు, ప్రమాణ స్వీకార కార్యక్రమాల సందర్భంగా వర్గాల మధ్య విభేదాలు బహిర్గతమవుతున్నాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

**కష్టకాలంలో పనిచేసిన వారికి గుర్తింపు ఎక్కడ?**

పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు జెండా మోసి, కేసులు ఎదుర్కొని, కార్యకర్తలను కాపాడుకుంటూ పనిచేశాం. ఇప్పుడు అధికారం వచ్చిన తర్వాత ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారు.. అంటూ కొందరు సీనియర్ కార్యకర్తలు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అసంతృప్తిని చల్లార్చి, అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటేనే క్షేత్రస్థాయిలో పార్టీ బలం మరింత పెరుగుతుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# కరెంట్ లేక.. పథకాలు రాక.. పదేళ్లుగా కోయల రోదన

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెలలో 19 గిరిజన కుటుంబాల అవస్థలు
- స్థానిక ఆధారాలున్నా దక్కని సంక్షేమం
- తాత్కాలిక విద్యుత్ లైన్లు తొలగిస్తున్న అటవీ శాఖ అధికారులు
- మౌలిక వసతులు కల్పించాలని బాధితుల విజ్ఞప్తి



**ప్రజా వాయిస్ పలిమెల** అది మండల కేంద్రమే.. కానీ ఆ గూడెంలో వెలుగులు లేవు. పదేళ్లుగా నివాసముంటున్నా కనీస మౌలిక వసతులు నోచుకోలేదు. ఆధార్, గుర్తింపు కార్డులు ఉన్నా ప్రభుత్వ సంక్షేమ పథకాలు దక్కడం లేదంటూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండల కేంద్రంలోని 19 కోయ గిరిజన కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

**హామీలకే పరిమితమైన విద్యుత్**

ఛత్తీస్‌గఢ్, మేడారం తదితర ప్రాంతాల నుంచి వలస వచ్చిన 19 కుటుంబాలు పదేళ్ల క్రితం పలిమెలలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. నివాస ఆధారాలు, స్థానిక గుర్తింపు కార్డులు ఉన్నప్పటికీ వీరికి విద్యుత్, తాగునీటి సౌకర్యం అందడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించగా.. విద్యుత్ శాఖ అధికారులు గతంలో సర్వే నిర్వహించి విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ ఏళ్లు గడుస్తున్నా ఆ హామీ అమలుకు నోచుకోలేదు.

**అటవీ అధికారుల అడ్డంకులు**

రాత్రి వేళ చీకటిలో పురుగులు, విషసర్పాల భయంతో గడపలేక గిరిజనులు తాత్కాలికంగా స్వయంగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేసుకున్నారు. అయితే అటవీ శాఖ అధికారులు ఆ లైన్లను తొలగిస్తున్నారని గిరిజనులు వాపోతున్నారు. విద్యుత్ అధికారుల అనుమతులతోనే తాము లైన్లు వేసుకున్నామని చెబుతున్నా వినకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులు స్పందించాలి:**

రాత్రి వేళ చీకట్లో ఉండాల్సి వస్తోందని, తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి తమ గూడేనికి విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలని, పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని వేడుకుంటున్నారు.



# ఆర్థిక సేవలకు కొత్త వేదిక.. డీసీసీబీ నూతన బ్రాంచ్

- మిర్యాలగూడ-2 నూతన బ్రాంచ్‌ను ప్రారంభం
- రైతులు, మహిళా సంఘాలు, చిన్న వ్యాపారులకు మరింత చేరువలో బ్యాంకింగ్ సేవలు
- గ్రామీణ ప్రజలకు ఆర్థికంగా అండగా నిలవాలని బ్యాంకు అధికారులకు సూచన
- నూతన బ్రాంచ్‌తో మిర్యాలగూడ ప్రజలకు మెరుగైన సౌకర్యాల అందుబాటు
- ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్, కాంగ్రెస్ నేతలు, బ్యాంకు అధికారులు

**మిర్యాలగూడ.మిర్యాలగూడ** పట్టణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేసేందుకు నల్గొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ (డీసీసీబీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిర్యాలగూడ-2 నూతన బ్రాంచ్‌ను మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) ప్రారంభించారు. శుక్రవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి నూతన బ్రాంచ్‌ను అధికారికంగా ప్రారంభించారు.అనంతరం బ్యాంకు సిబ్బందితో కలిసి బ్రాంచ్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఖాతాదారులకు అందుబాటులో ఉండే సేవలు, బ్యాంకింగ్ సౌకర్యాలు, ప్రజలకు కల్పించనున్న ఆర్థిక సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, సహకార బ్యాంకులు రైతులు, మహిళా సంఘాలు, చిన్న వ్యాపారులు, సామాన్య ప్రజల ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. మిర్యాలగూడ-2 నూతన బ్రాంచ్ ఏర్పాటు ద్వారా ఈ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా బ్యాంకింగ్ సేవలను విస్తరించడంతో పాటు రైతులు, గ్రామీణ ప్రజలు ఆర్థికంగా మరింత బలోపేతం అయ్యేలా సహకార బ్యాంకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రైతులకు అవసరమైన సమయంలో ఆర్థిక సహాయం, మహిళా సంఘాలకు ప్రోత్సాహం, చిన్న వ్యాపారులకు సులభమైన బ్యాంకింగ్ సేవలు అందించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.మిర్యాలగూడ ప్రాంత ప్రజలకు డీసీసీబీ సేవలను మరింత చేరువ చేయడంలో ఈ నూతన బ్రాంచ్ కీలకంగా నిలుస్తుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. సహకార రంగాన్ని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు నమ్మకమైన, వేగవంతమైన సేవలు అందించాలని బ్యాంకు సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, డీసీసీ జనరల్ సెక్రటరీ చిలుకూరి బాలకృష్ణ, కాంగ్రెస్ నాయకుడు గుడిపాటి నవీన్, బ్యాంకు అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఖాతాదారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# రాఖీ కట్టిన చిన్నారుల ఆప్యాయతకు కడియం కుటుంబం భావోద్వేగం

- మానసిక దివ్యాంగ చిన్నారులతో రాఖీ వేడుకలు జరుపుకున్న ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- ఆత్మీయంగా రాఖీలు కట్టిన మల్లికాంబ మనోవికాస కేంద్రం చిన్నారులు
- చిన్నారులకు స్వయంగా మిఠాయిలు తినిపించి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

**ప్రజా వాయిస్,హన్మకొండ:** సోదర సోదరీమణుల అనురాగానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమిని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి మానసిక దివ్యాంగ చిన్నారులతో కలిసి ఆత్మీయంగా జరుపుకున్నారు. హన్మకొండ కనకదుర్గ కాలనీలోని కడియం కుటుంబ నివాసంలో మల్లికాంబ మనోవికాస కేంద్రం చిన్నారులతో ఈ వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా కేంద్రానికి చెందిన చిన్నారులు ఎంతో ఉత్సాహంగా ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరికి రాఖీలు కట్టారు. చిన్నారులు చూపించిన స్వచ్ఛమైన ఆప్యాయతకు వారు భావోద్వేగానికి గురయ్యారు. రాఖీలు కట్టిన చిన్నారులకు స్వయంగా మిఠాయిలు తినిపించి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. వారితో కాసేపు ముచ్చటించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కడియం కావ్య, కడియం శ్రీహరి మాట్లాడుతూ పండుగలను కేవలం కుటుంబ సభ్యులతోనే కాకుండా సమాజంలో ప్రేమాభిమానాలు, ప్రత్యేక ఆదరణ అవసరమైన దివ్యాంగ పిల్లలతో కలిసి జరుపుకోవడంలోనే నిజమైన ఆనందం ఉందన్నారు. వారికి తగిన ప్రోత్సాహం, ఆప్యాయత అందిస్తే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని పేర్కొన్నారు.దివ్యాంగ చిన్నారులను ఆప్యాయంగా చూసుకుంటూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్న మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు, ఉపాధ్యాయులను అభినందించారు. దివ్యాంగ పిల్లల సంక్షేమంతోపాటు మల్లికాంబ మనోవికాస కేంద్రం అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకులు, ప్రతినిధులు, చిన్నారులు పాల్గొన్నారు.


# అధికార కేంద్రీకరణ వద్దు స్థానిక సంస్థలకు స్వేచ్ఛ ముద్దు.!

- మున్సిపల్ బిల్లుపై సమగ్ర చర్చ జరపాలి
- ప్రజల భాగస్వామ్యం, కార్పొరేటర్ల హక్కులకు ప్రాధాన్యం ఇవ్వాలి

**ప్రజావాయిస్/రాజేంద్రనగర్:** హైదరాబాద్ మహానగర పాలనను ఆధునీకరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన 2026 కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లుపై శాసనసభలో సమగ్ర చర్చ జరిపిన అనంతరమే నిర్ణయం తీసుకోవాలని 'ది సిటీజన్స్ కౌన్సిల్' కోరింది. ఈ మేరకు శాసనసభ్యులందరికీ కౌన్సిల్ ప్రతినిధులు బహిరంగ లేఖ రాశారు.స్థానిక సంస్థల స్వయం ప్రతిపత్తికి భంగం కలిగేలా అధికారాలు కేంద్రీకృతం కాకుండా అధికారాల వికేంద్రీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన ప్రతిపాదించిన అత్యున్నత మండలి పరిధి, అధికారాలపై స్పష్టమైన పరిమితులు,చట్టపరమైన రక్షణలు ఉండాలని కోరారు.ప్రతి వార్డులో సమర్థవంతమైన వార్డు కమిటీలను ఏర్పాటు చేసి మహిళలు,పౌర సమాజం, నివాస సంక్షేమ సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ప్రజల రోజువారీ సమస్యల పరిష్కారానికి కమిషనర్, జోనల్,డిప్యూటీ కమిషనర్లకు తగిన ఆర్థిక, పరిపాలనా అధికారాలు ఇవ్వాలని పేర్కొన్నారు.అదేవిధంగా పన్నుల విధానంలో పారదర్శకత, న్యాయబద్ధత పాటించాలని,ఎన్నికైన కార్పొరేటర్లకు తగిన సంస్థాగత పాత్ర,ప్రోటోకాల్ కల్పించాలని కోరారు. కార్పొరేషన్ వ్యవహారాల్లో రాష్ట్ర ప్రభుత్వ జోక్యానికి స్పష్టమైన పరిమితులు విధించాలని సూచించారు.ప్రతిపాదిత అప్పిలేట్ అథారిటీకి స్వతంత్రత, తగిన న్యాయపరమైన అధికారాలు కల్పించి మున్సిపల్ వివాదాలను వేగంగా పరిష్కరించేలా చూడాలని శాసనసభ్యులకు విజ్ఞప్తి చేశారు.ఈ బహిరంగ లేఖపై సీతారం దూళిపాల,అందె లక్ష్మణ్‌రావు,ఆరీఫ్ మహమ్మద్,బొడ్డు శ్రీధర్, ఆకుల నరేష్,తదితరులు సంతకాలు చేశారు.

## నేపాల్ విపత్తుపై కేంద్రానికి కడియం లేఖ

- తెలంగాణ బాధితులకు తక్షణ వైద్యం అందించాలి
- గల్లంతైన వారి కోసం గాలింపు ముమ్మరం చేయాలి
- మృతదేహాలను స్వదేశానికి తరలించాలి
- భారత రాయబార కార్యాలయ అధికారులతో ఎంపీ ఫోన్ లో మాటామంతీ
- బాధిత కుటుంబాలకు ఎప్పటి కప్పుడు సమాచారం ఇవ్వాలి



**ప్రజా వాయిస్,హన్మకొండ:** నేపాల్‌లో సంభవించిన విపత్తులో తెలంగాణకు చెందిన పలువురు గాయపడటం, కొందరు మృతిచెందడం, మరికొందరు గల్లంతైన నేపథ్యంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌కు లేఖ రాశారు. బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించడంతోపాటు గల్లంతైన వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని కోరారు.నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం, కాన్సులర్ అధికారులతో సమన్వయం చేసుకుని తెలంగాణకు చెందిన క్షతగాత్రులకు అవసరమైన చికిత్స, ఆసుపత్రి సదుపాయాలు, మందులు తదితర అత్యవసర సహాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. విపత్తులో మృతిచెందిన వారి మృతదేహాలను గుర్తించి, అధికారిక ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి స్వదేశానికి తరలించాలని కోరారు.

### గల్లంతైన వారి కోసం ముమ్మరంగా గాలింపు

ఆచూకీ తెలియని తెలంగాణకు చెందిన వారి కోసం నేపాల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ శోధన, సహాయక చర్యలను వేగవంతం చేయాలని కడియం కావ్య కోరారు. భారత రాయబార కార్యాలయం, నేపాల్ అధికారులు, రెస్క్యూ బృందాలు కుటుంబాలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ బాధితుల సమాచారాన్ని ఎప్పటి కప్పుడు అందించాలని సూచించారు.

### రాయబార కార్యాలయ అధికారులతో ఫోన్ లో మాటామంతీ

కేంద్ర మంత్రికి లేఖ పంపిన అనంతరం కాఠ్మాండూలోని భారత రాయబార కార్యాలయ ఉన్నతాధికారులతో ఎంపీ కడియం కావ్య ఫోన్‌లో మాట్లాడారు. బాధితుల పరిస్థితి, సహాయక చర్యలు, గల్లంతైన వారి ఆచూకీ, మృతదేహాల గుర్తింపు, స్వదేశానికి తరలింపు అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలు ఆందోళనలో ఉన్నందున ప్రతి ఒక్కరి ఆచూకీ కోసం అన్ని విధాలా ప్రయత్నాలు కొనసాగించాలని కోరారు.

### ప్రతి బాధితుడికి అండగా నిలవాలి

నేపాల్‌లో చిక్కుకున్న లేదా విపత్తు ప్రభావానికి గురైన తెలంగాణ ప్రజలకు సత్వర సహాయం అందేలా కేంద్ర ప్రభుత్వం, భారత రాయబార కార్యాలయం, నేపాల్ అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని కడియం కావ్య కోరారు. బాధితుల రక్షణ, వైద్యం, మృతదేహాల తరలింపు, గల్లంతైన వారి గాలింపు పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.



## రాఖీ వేళ.. బస్టాండ్, బస్సు లో బీభత్స రద్దీ..!

- అదనపు సర్వీసుల ప్రకటనలకే పరిమితం
- కిక్కిరిసిన బస్సుల్లో మహిళలు, పిల్లల అవస్థలు
- గంటల తరబడి పడిగాపులు.. ఆటోలు, ప్రైవేట్ వాహనాల దోపిడీ

**ప్రజా వాయిస్,కామారెడ్డి:** రాఖీ పౌర్ణమి, వరుస సెలవులతో కామారెడ్డి జిల్లాలో ఆర్టీసీ బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిశాయి. రద్దీకి తగ్గట్టుగా బస్సులు లేకపోవడంతో మహిళలు, చిన్నారులు గంటల తరబడి బస్సుల కోసం నిరీక్షించారు. వచ్చిన బస్సుల్లో నిలబడేందుకు కూడా చోటు లేక కిక్కిరిసి ప్రయాణించాల్సి వచ్చింది. అదనపు బస్సులు ఏర్పాటు చేస్తామని అధికారులు ప్రకటించినా.. క్షేత్రస్థాయిలో ఆ మేరకు సర్వీసులు కనిపించలేదని ప్రయాణికులు వాపోయారు. దీంతో పలువురు ఆటోలు, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించగా, అదనపు చార్జీలు వసూలు చేశారని ఆరోపించారు. కామారెడ్డి బస్టాండ్‌లో మంచినీరు, మూత్రశాలల్లో నీటి సౌకర్యం లేక మహిళలు, పిల్లలు ఇబ్బందులు పడ్డారు. పండుగ రద్దీకి అనుగుణంగా బస్సులు పెంచకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



## మురుగులో మునిగిన జహీరాబాద్

- డ్రైనేజీ నీటితో రోడ్లు మయం.. దోమల విజృంభణతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు
- కాలువల్లో మురుగు పేరుకుపోయి భరించలేని దుర్వాసన
- చిన్నారులు, వృద్ధులకు తప్పని అనారోగ్య భయం
- డ్రైనేజీలు శుభ్రం చేసి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్

**ప్రజా వాయిస్, జహీరాబాద్:** జహీరాబాద్ మున్సిపల్ పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో మురుగు కాలువలు నిండిపోయి మురుగు నీరు ముందుకు వెళ్లకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీలు నరకకూపాలుగా మారి దుర్వాసన వెదజల్లుతుండటంతో స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.జాతీయ రహదారి నుంచి సంఘమిత్ర హైస్కూల్ వెళ్లే రహదారిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. డ్రైనేజీల్లో మురుగు నీరు నిలిచిపోవడంతో రోడ్డుపైకి చేరుతోంది. కొద్దిపాటి వర్షానికే పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోంది. నిల్వ నీటితో దోమలు విపరీతంగా పెరగడంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.డ్రైనేజీ నిర్మాణ సమయంలో మురుగు నీరు వెళ్లేందుకు కనీసం తాత్కాలిక ప్రత్యామ్నాయ మార్గాన్ని కూడా ఏర్పాటు చేయకపోవడంతో సమస్య తీవ్రరూపం దాల్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దుర్వాసన, దోమల బెడదతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.మున్సిపల్ అధికారులు సమస్యపై తక్షణమే స్పందించాలని పట్టణవాసులు కోరుతున్నారు. అన్ని డ్రైనేజీలను శుభ్రం చేసి, మురుగు నీరు సాఫీగా వెళ్లేలా తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని, దోమల నివారణ మందులు పిచికారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకుని శాశ్వత డ్రైనేజీ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# రాఖీ వేళ.. రాజన్న ఇంట ఆత్మీయ కలయిక

- అక్కాచెల్లెళ్ల ప్రేమానురాగాల మధ్య ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు
- నలుగురు సోదరీమణుల చేత రాఖీలు కట్టించుకున్న మునుగోడు ఎమ్మెల్యే
- కుటుంబ సభ్యులు, అక్కల కుటుంబాలతో సంప్రదాయబద్ధంగా వేడుకలు
- మనుమరాలు వాన్యతో కలిసి రాఖీ పండుగలో ప్రత్యేక సందడి
- మునుగోడుతో పాటు వివిధ నియోజకవర్గాల ఆడపడుచులతో ఆత్మీయ భేటీ
- ప్రతి ఇంట సంతోషం, శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్ష



**ప్రజా వాయిస్,హైదరాబాద్.** రాఖీ పౌర్ణమి సందర్భంగా మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి నివాసంలో ఆత్మీయ కలయిక నెలకొంది. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధం, పరస్పర విశ్వాసానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కుటుంబ సభ్యులు, సోదరీమణుల మధ్య ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా రాజ్‌గోపాల్‌రెడ్డి నలుగురు సోదరీమణులు ఆయనకు రాఖీలు కట్టి ప్రేమాభిమానాలను చాటుకున్నారు. అక్కాచెల్లెళ్ల ఆశీర్వాదాలు, కుటుంబ సభ్యుల ఆప్యాయతల మధ్య రాఖీ వేడుకలు ఎంతో ఆత్మీయంగా సాగాయి. తన అక్కల కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయబద్ధంగా రాఖీ పండుగను జరుపుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ ఆత్మీయ కలయికలో రాజ్‌గోపాల్‌రెడ్డి మనుమరాలు వాన్య కూడా ప్రత్యేక సందడి చేసింది. కుటుంబ సభ్యులతో కలిసి ఆమె కూడా రాఖీ వేడుకల్లో పాల్గొనగా, చిన్నారుల సందడి, పెద్దల ఆప్యాయతలతో రాజ్‌గోపాల్‌రెడ్డి నివాసం పండుగ వాతావరణంతో కళకళలాడింది.అనంతరం మునుగోడు నియోజకవర్గంతో పాటు వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన సోదరీమణులు రాజ్‌గోపాల్‌రెడ్డికి రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. వారితో ఆత్మీయంగా ముచ్చటించిన ఆయన, రాఖీ పండుగ సోదరసోదరీమణుల మధ్య అనుబంధాలను మరింత బలోపేతం చేసే గొప్ప పండుగ అని పేర్కొన్నారు.కుటుంబ వ్యవస్థకు, భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు రాఖీ పౌర్ణమి ఎంతో ప్రాధాన్యత కలిగిన పండుగ అని రాజ్‌గోపాల్‌రెడ్డి అన్నారు. ప్రతి సోదరుడు తన సోదరీమణుల రక్షణ, గౌరవం, భద్రతకు ఎల్లప్పుడూ అండగా నిలవాలని ఆకాంక్షించారు. అదే సమయంలో సోదరీమణులు తమ కుటుంబాల్లో ప్రేమానురాగాలు, ఆప్యాయతలు, ఐక్యతను మరింత పెంపొందించాలని కోరారు.రాఖీ పౌర్ణమి ప్రతి కుటుంబంలో సంతోషం, శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యతను నింపాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని కోరుతూ మునుగోడు నియోజకవర్గ ప్రజలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని ఆడపడుచులందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ వేడుక సందర్భంగా రాజ్‌గోపాల్‌రెడ్డి నివాసంలో నెలకొన్న ఈ ఆత్మీయ కలయిక కుటుంబ బంధాల మాధుర్యాన్ని మరోసారి చాటిచెప్పింది.

# అశ్వారావుపేట ఆస్పత్రిలో ఆధిపత్య 'జబ్బు'

- కొందరు సిబ్బంది చుట్టూ సాగుతున్న వ్యవహారాలపై ఆరోపణలు
- ప్రజలకు వైద్య సేవల కంటే పలుకుబడికే ప్రాధాన్యమంటూ విమర్శలు
- ఏళ్ల తరబడి ఒకేచోటే విధులు.. బదిలీలపై ప్రశ్నలు
- పారిశుద్ధ్యం, సిబ్బంది హాజరుపై పర్యవేక్షణ ఏదీ?
- 15 ఏళ్లలో ఆస్పత్రిలో సీసీ కెమెరాల ఏర్పాటుపై నిర్లక్ష్యమా?
- నిర్వహణపై సమగ్ర విచారణకు స్థానికుల డిమాండ్




**ప్రజా వాయిస్,అశ్వారావుపేట:** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిలో కొందరు సిబ్బంది ఆధిపత్యం కొనసాగుతోందన్న ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. ప్రజా ప్రతినిధులతో సన్నిహిత సంబంధాలు ఉన్న కొందరు సిబ్బంది తమకు అనుకూలంగా ఆసుపత్రి వ్యవహారాలను నడిపిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో సామాన్య రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని 30 పడకల ఏరియా ఆసుపత్రి మండల ప్రజలకు కీలక వైద్య కేంద్రం. అశ్వారావుపేటతో పాటు పరిసర ప్రాంతాల నుంచి నిత్యం రోగులు వైద్యం కోసం వస్తుంటారు. అత్యవసర పరిస్థితుల్లో సమీప ప్రాంతాల ప్రజలు కూడా ఈ ఆసుపత్రినే ఆశ్రయిస్తారు. ఇంతటి ప్రాధాన్యమున్న ఆసుపత్రిలో వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది ఉన్నప్పటికీ సేవల తీరుపై తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.

### ఒకేచోటే ఏళ్ల తరబడి..

కొంతమంది ఉద్యోగులు దీర్ఘకాలంగా ఇదే ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ పలుకుబడితో బదిలీలకు దూరంగా ఉంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. సుదీర్ఘకాలం ఒకేచోట పనిచేస్తున్న సిబ్బంది వివరాలను ఉన్నతాధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

### పారిశుద్ధ్యంపై పట్టింపేదీ.?

ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణపైనా విమర్శలు వినిపిస్తున్నాయి. రోగులకు ఇబ్బంది కలగకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, పనుల పర్యవేక్షణ సక్రమంగా లేదని ఆరోపణలు ఉన్నాయి. కార్మికుల హాజరు, విధుల నిర్వహణపై ఉన్నతాధికారులు తనిఖీలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### సీసీ కెమెరాలు ఎక్కడ.?

ఆసుపత్రిలో సిబ్బంది విధులు, రోగులకు అందుతున్న సేవలను పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అవసరం. అయితే ఆసుపత్రి ప్రారంభమై సుమారు 15 ఏళ్లు అవుతున్నా తగిన స్థాయిలో సీసీ కెమెరాల ఏర్పాటు కనిపించకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు, అందుబాటులో ఉన్న మందుల సమాచారం వంటి వివరాలను నోటీసు బోర్డులపై ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది.

### మీడియాకు ఆంక్షలపై విమర్శలు

ఆసుపత్రి ఆవరణలో మీడియా ప్రతినిధులు దృశ్యాలు చిత్రీకరించకుండా ఆంక్షలు విధించడంపైనా స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణలో పారదర్శకత ఉండాలని, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించే అవకాశం ఉండాలని వారు కోరుతున్నారు.

### కలెక్టర్ దృష్టి సారించాలి

ఆసుపత్రిలో సిబ్బంది విధుల నిర్వహణ, దీర్ఘకాలిక పోస్టింగులు, హాజరు, పారిశుద్ధ్యం, సీసీ కెమెరాల ఏర్పాటు, రోగులకు అందుతున్న వైద్య సేవలపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఏళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న సిబ్బందిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని, ప్రభుత్వ ఆసుపత్రి సేవలు సామాన్య ప్రజలకు సమర్థంగా అందేలా చూడాలని కోరుతున్నారు.

# ఎవడు వాడు?

- వాడి ప్రశ్న...ఒక విస్ఫోటనం
- వాడి అరెస్టు ఈ దేశ ప్రజాస్వామ్య తీరు
- వాడే ఈ దేశ ముఖచిత్రం


**ప్రజా వాయిస్, హుజూర్ నగర్**, ఆగష్టు 28వాడి అరెస్టు దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతుంది వాడి నిర్బంధం ఈ దేశ ప్రజాస్వామ్యానికి అద్దం పడుతోంది. ఇంతకీ ఎవడు వాడు? వాడే...ప్రశ్నించే ధైర్యం ఉన్న ప్రతీ భారతీయుడు వాడు ఏం ప్రశ్నించాడు?ఎందుకు అరెస్టు చేసి నిర్బంధించారు?వాడు అడిగిన ప్రశ్నలో దేశభక్తి కనపడలేదా? వాడు ఎదుర్కొనే నిర్బంధం భారత ప్రజాస్వామ్యానికి పరీక్ష కాదా?ప్రశ్నను అరెస్టు చేయగలరా? ప్రశ్నించే ఆలోచనను అరెస్టు చేయడం సాధ్యమవుతుందా? వాడు ప్రశ్నించిన తీరులో... అవినీతిని ప్రశ్నించే సామాన్యుడి ఆవేదన ఉంది.

### అందుకే వాడి ప్రశ్న ఒక విస్ఫోటనం

అలాంటి ప్రశ్నించే గొంతే ఇప్పుడు ఈ దేశ ముఖచిత్రంగా మారింది. అతడు పెద్ద నాయకుడు కాకపోవచ్చు.అతడి వెనుక అధికార బలం ఉండకపోవచ్చు. కోట్లాది రూపాయల ఆస్తులు ఉండకపోవచ్చు. కానీ అతడి చేతిలో ఉన్నది ఒక ఆయుధం ప్రశ్న. ఆ ప్రశ్నలో ప్రజల బాధ ఉంది. ఆ ప్రశ్నలో నిరుద్యోగి ఆవేదన ఉంది. రైతు కన్నీరు ఉంది. సామాన్యుడి నిస్సహాయత ఉంది. వ్యవస్థపై పెరుగుతున్న అసంతృప్తి ఉంది.మొత్తంగా అతడి పోరాటంలో రేపటి భారతం ఉంది. అందుకే అతడి ప్రశ్న చిన్నదిగా కనిపించినా దాని ప్రభావం మాత్రం విస్ఫోటనమయింది

### వాడే ఈ దేశ ముఖచిత్రం

ఒక వ్యక్తి ప్రశ్నిస్తే అది ఒక గొంతు. వంద మంది ప్రశ్నిస్తే అది ఒక ఉద్యమం.లక్షల మంది ప్రశ్నిస్తే అది ప్రజా తీర్పు.వాడి ప్రశ్న వెనుక ఆలోచన, ఆలోచన వెనుక చైతన్యం, చైతన్యం వెనుక సమాజం ఉంటుంది. అందుకే వాడే ఈ దేశ ముఖ చిత్రమయిండు



### అరెస్టు...ప్రజాస్వామ్యానికి అద్దం

చట్టాన్ని ఉల్లంఘించినప్పుడు చట్టపరమైన చర్యలు తప్పవు. అది ఏ వ్యక్తికైనా వర్తిస్తుంది. కానీ ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టపరమైన చర్యలు కూడా న్యాయం, పారదర్శకత, రాజ్యాంగ విలువల పరిధిలోనే ఉండాలి.ప్రశ్నించడం, విమర్శించడం, నిరసన వ్యక్తం చేయడం వంటి ప్రజాస్వామ్య హక్కులను నేరంగా చూడటం మాత్రం అత్యంత ప్రమాదకరమైన పరిణామం.

### ప్రజాస్వామ్యం అంటే కేవలం ఐదేళ్లకోసారి ఓటు వేయడం కాదు.

ఎన్నికల తర్వాత కూడా ప్రశ్నించే హక్కు, అధికారంలో ఉన్నవారిని నిలదీసే హక్కు, విధానాలను విమర్శించే హక్కు, తప్పులను చూపించే హక్కు,న్యాయం కోసం నిరసన తెలిపే హక్కు.ఈ హక్కులన్నీ బలంగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం సజీవంగా ఉంటుంది.

### ప్రశ్నిస్తే నేరమా?

ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికీ ఉంటుంది. పాలకులు ప్రజల కోసం పనిచేస్తున్నారా? ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? ప్రజల డబ్బు ఎలా ఖర్చవుతోంది? అవినీతి ఎందుకు పెరుగుతోంది? ఉద్యోగాలు ఎక్కడ? రైతుకు న్యాయం ఎక్కడ? సామాన్యుడికి భద్రత ఎక్కడ? ఇలాంటి ప్రశ్నలు అడగడం ప్రజాస్వామ్యానికి ప్రమాదం కాదు.

### ఏది నిజమైన దేశభక్తి

పాలకులను ప్రశ్నించకపోవడం దేశభక్తి కాదు. దేశం కోసం పాలకులను ప్రశ్నించడమే నిజమైన దేశభక్తి. జెండాను గౌరవించడం ఎంత ముఖ్యమో ఆ జెండా కింద జీవిస్తున్న ప్రతి పౌరుడి హక్కులను గౌరవించడం అంతకంటే ముఖ్యం. దేశాన్ని విమర్శించడం దేశద్రోహం కాదు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రశ్నించడం, ప్రజల కన్నీళ్లను చూసి స్పందించడం, అన్యాయాన్ని చూసి గొంతెత్తడం, అధికారాన్ని నిలదీయడంఇవే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ప్రశ్నలు కానీ ప్రశ్నించిన గొంతును అణచివేయాలని ప్రయత్నించిన ప్రతిసారీ,ఆ గొంతు మరింత బలంగా తిరిగి వస్తుంది. ఒక వ్యక్తిని అరెస్టు చేయవచ్చు, ఒక సభను ఆపవచ్చు, ఒక గొంతును కొంతకాలం నిశ్శబ్దం చేయవచ్చు. కానీ ప్రశ్నించే ఆలోచనను అరెస్టు చేయడం సాధ్యం కాదు. ఒక పౌరుడు ప్రశ్నిస్తే అతడిని అరెస్టు చేయాల్సిన పరిస్థితి వస్తే అసలు ప్రశ్న అతడిపైన కాదు వ్యవస్థపైనే పడుతుంది.



# మోతెలో కెనరా బ్యాంక్ సేవలు

- నూతన శాఖ ప్రారంభం.
- రైతులు, మహిళలకు రుణ సదుపాయాలు

**ప్రజా వాయిస్,మోతె:** సూర్యాపేట జిల్లా మోతె మండల కేంద్రంలో కెనరా బ్యాంకు నూతన శాఖ శుక్రవారం ప్రారంభమైంది. బ్యాంకు ప్రాంతీయ మేనేజర్ ఎస్. సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి రిబ్బన్ కట్ చేసి శాఖను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కెనరా బ్యాంకు వందేళ్లకు పైగా ప్రజలకు సేవలందిస్తున్న ప్రముఖ బ్యాంకుగా గుర్తింపు పొందిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను మరింత విస్తరించాలనే ఉద్దేశంతో మండల కేంద్రాల్లో నూతన శాఖలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.మోతె శాఖ ద్వారా రైతులకు పంట రుణాలు, మహిళలకు రుణాలు, వ్యాపార రుణాలు, గృహ రుణాలతో పాటు వివిధ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో సూర్యాపేట హెడ్ అశోక్‌కుమార్, సూర్యాపేట మెయిన్ చీఫ్ మేనేజర్ ఎన్.ఉపేందర్, ఎంజీ రోడ్ సూర్యాపేట చీఫ్ మేనేజర్ బి.శ్రీధర్, మోతె శాఖ మేనేజర్ వి.మంగ్య నాయక్, శ్రీకాంత్, సర్పంచ్ దోసపాటి అనురాధ, కార్యదర్శి ఇమ్రాన్, ఉపసర్పంచ్ బొక్క ఉపేందర్‌రెడ్డి, కట్ల వెంకటరెడ్డి, బొడ్డు నరసయ్య, అయితేబోయిన వెంకన్న, బొడ్డు సాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల పేరుతో రూ.8 కోట్ల మోసం..?

- భద్రాచలం ఎమ్మెల్యే పీఏపై బాధితుల ఆరోపణలు
- ఎమ్మెల్యే కోటాలో ఉద్యోగాలంటూ నిరుద్యోగులకు వల
- డబ్బులు తీసుకుని నకిలీ అపాయింట్ మెంట్ లెటర్లు ఇచ్చారని ఫిర్యాదు
- బ్యాంకు లావాదేవీలు, నియామక పత్రాలతో డీఎస్పీని ఆశ్రయించిన బాధితులు
- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోనూ బాధితులున్నట్లు వెల్లడి
- ఎమ్మెల్యే పేరు ప్రస్తావించి వసూళ్లు చేశారా.? విచారణలో తేలాల్సిందే



**ప్రజా వాయిస్,భద్రాచలం:** ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసి, నకిలీ నియామక పత్రాలు ఇచ్చారనే ఆరోపణలు భద్రాచలంలో వెలుగులోకి వచ్చాయి. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు వద్ద పీఏగా పనిచేస్తున్న కళ్యాణ్ తమ నుంచి ఉద్యోగాల పేరుతో డబ్బులు తీసుకున్నారని పలువురు బాధితులు ఆరోపించారు. తమ వద్ద ఉన్న బ్యాంకు లావాదేవీలు, చెల్లింపుల ఆధారాలు, అపాయింట్‌మెంట్ లెటర్లతో భద్రాచలం డీఎస్పీని ఆశ్రయించినట్లు తెలిపారు.

### ఎమ్మెల్యే కోటాలో పోస్టులంటూ

మూడు పోస్టులు ఎమ్మెల్యే కోటాలో వస్తాయని, ఒకటి బంధువులకు కేటాయించామని, మిగిలిన పోస్టుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని కళ్యాణ్ చెప్పినట్లు బాధితులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే పేరు ప్రస్తావించడంతో నమ్మి పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించినట్లు తెలిపారు.

### నకిలీ నియామక పత్రాలు

డబ్బులు తీసుకున్న అనంతరం ఉద్యోగ నియామకం పూర్తయిందంటూ అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చారని బాధితులు చెబుతున్నారు. వాటిని సంబంధిత కంపెనీల వద్ద చూపించగా తమ సంస్థలకు చెందినవి కావని తేలడంతో మోసం బయటపడిందని తెలిపారు.

### రూ.8 కోట్ల వరకు వసూళ్లా.?

భద్రాచలంతో పాటు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు, పరిసర ప్రాంతాల్లో పలువురి నుంచి ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటివరకు బయటకు వచ్చిన బాధితుల వివరాల ప్రకారం మొత్తం వసూళ్లు రూ.8 కోట్ల వరకు ఉండొచ్చని వారు పేర్కొంటున్నారు. ఈ మొత్తం పోలీసుల విచారణలో నిర్ధారణ కావాల్సి ఉంది.

### ఎమ్మెల్యే పేరు వినియోగించారా.?

ఈ వ్యవహారంపై బాధితులు ఎమ్మెల్యేను సంప్రదించగా తనకు సంబంధం లేదని, పోలీసులను ఆశ్రయించాలని సూచించినట్లు తెలిపారు. దీంతో ఎమ్మెల్యే పేరు చెప్పి పీఏ డబ్బులు వసూలు చేశాడా? ఈ వ్యవహారంలో మరెవరైనా ఉన్నారా? అన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

### ఆధారాలతో పోలీసులను ఆశ్రయించిన బాధితులు

బ్యాంకు లావాదేవీలు, చెల్లింపుల వివరాలు, అపాయింట్‌మెంట్ లెటర్లను పోలీసులకు అందించినట్లు బాధితులు తెలిపారు. నకిలీ పత్రాలు ఎవరు రూపొందించారు? ఎంతమంది నుంచి డబ్బులు తీసుకున్నారు? రూ.8 కోట్ల ఆరోపణల్లో వాస్తవమెంత? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగాల్సి ఉంది.

# ఇండ్ల పనుల్లో వేగం పెంచండి

- డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో చిన్న లోపాలనూ వెంటనే సరిచేయాలి
- డ్రైనేజీ, తాగునీరు, రోడ్ల పనులు త్వరగా పూర్తి చేయాలి
- మోడల్ కాలనీలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ , డైనింగ్ హాల్ పనులకు ప్రాధాన్యం
- శాఖల మధ్య సమన్వయంతో నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలి
- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**ప్రజా వాయిస్, హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ రామస్వామిగుట్ట వద్ద నిర్మిస్తున్న డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పనులను వేగవంతం చేసి, మిగిలిన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మోడల్ కాలనీని పరిశీలించిన ఆయన.. ఇళ్లలో కనిపిస్తున్న చిన్నచిన్న లోపాలను సైతం వెంటనే గుర్తించి సరిదిద్దాలని సూచించారు.కాలనీలో డ్రైనేజీ, తాగునీరు, రహదారులు వంటి మౌలిక వసతుల పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్, డైనింగ్ హాల్, అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, స్ట్రామ్‌వాటర్ డ్రెయిన్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు.కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ కవిత, మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.







# పార్కింగ్‌లో స్కానింగ్ కేంద్రాలా..!

- డయాగ్నస్టిక్ సెంటర్లపై కలెక్టర్ కొరడా
- మెప్సన్ , న్యూ విజన్ కు నోటీసులు

**ప్రజా వాయిస్,హన్మకొండ:** డయాగ్నస్టిక్ సెంటర్లలో నిబంధనల ఉల్లంఘనలకు చెక్ పెట్టేందుకు హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ కొరడా ఝుళిపించారు. కాకాజీ కాలనీలోని మెప్సన్, న్యూ విజన్ డయాగ్నస్టిక్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేసి.. పార్కింగ్ స్థలాల వినియోగంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డింగ్ ప్లాన్ ప్రకారం పార్కింగ్‌కు కేటాయించిన స్థలాలను ఇతర అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించిన కలెక్టర్.. రెండు కేంద్రాలకు నోటీసులు జారీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ. అప్పయ్యను ఆదేశించారు.

### ధరల పట్టిక ఎక్కడ..?

మెప్సన్ డయాగ్నస్టిక్ సెంటర్‌లో అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్, ఎంఆర్ఐ విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. వివిధ స్కానింగ్ పరీక్షలకు సంబంధించిన ధరల పట్టికను ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్కానింగ్ సేవలందిస్తున్న వైద్యుల వివరాలను కూడా అందరికీ కనిపించేలా ప్రదర్శించాలన్నారు.

### తాళం వేసి ఉండటంతో.. సెల్లార్ లోకి

న్యూ విజన్ డయాగ్నస్టిక్ సెంటర్ తనిఖీకి వెళ్లిన సమయంలో కేంద్రానికి తాళం వేసి ఉండటంతో కలెక్టర్ అక్కడి అండర్‌గ్రౌండ్ (సెల్లార్)ను పరిశీలించారు. పార్కింగ్ కోసం అనుమతించిన స్థలాలను ఇతర అవసరాలకు వినియోగిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

### నిబంధనలు పాటించాల్సిందే

ప్రతి క్లినిక్, ఆసుపత్రి, డయాగ్నస్టిక్ సెంటర్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం, పీసీపీఎన్‌డీటీ చట్టంతోపాటు బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు.

### మరికొన్ని ఆసుపత్రులపైనా తనిఖీలు

కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య కాకతీయ కిడ్నీ సెంటర్, సిద్ధార్థ కార్డియాక్ సెంటర్, వినోద డెంటల్, మల్లిక చిల్డ్రన్స్ హాస్పిటళ్లను తనిఖీ చేశారు. పార్కింగ్ స్థలాలను మెడికల్ షాపులు, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించిన ఆసుపత్రులకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది సందీప్, రంజిత్ పాల్గొన్నారు.

# రోడ్డెక్కిన నిరసనపై పోలీసుల క్లారిటీ

- డబ్బా కొట్టు తొలగింపులో పోలీసుల పాత్ర లేదు
- ట్రాఫిక్ క్లియర్ చేసేందుకే జోక్యం
- డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి స్పష్టం

**ప్రజా వాయిస్,కోదాడ:** యాదవ్‌బజార్ ప్రధాన రహదారిపై జరిగిన నిరసన, పోలీసులపై వచ్చిన ఆరోపణలపై కోదాడ డీఎస్పీ ఆర్.శ్రీనివాస్‌రెడ్డి స్పష్టతనిచ్చారు. రహదారికి అడ్డుగా ఉన్న డబ్బా కొట్టును మున్సిపల్ అధికారులే తొలగించారని, పోలీసులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. రక్షాబంధన్ సందర్భంగా రద్దీ అధికంగా ఉండటంతో నిరసన కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిందని తెలిపారు. పోలీసులు పలుమార్లు రహదారి ఖాళీ చేయాలని సూచించినా నిరసన కొనసాగడంతో కొంతమందిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి చట్టపరమైన చర్యలు చేపట్టామన్నారు.నిరసనకారులపై టౌన్ సీఐ చేయిచేసుకున్నారన్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. సోషల్‌మీడియా వ్యాఖ్యలపై మాదాల ఉపేందర్ యాదవ్‌పై క్రైం నంబర్ 434/2026 కింద కేసు నమోదై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. పోలీసుల చర్యల్లో ఎలాంటి రాజకీయ కక్ష, వ్యక్తిగత ద్వేషం లేదని డీఎస్పీ పేర్కొన్నారు.



# విద్యుత్ సంస్కరణల ముసుగులో దోపిడీ

- కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే కేంద్రం కుట్ర
- రైతుల మోటార్లకు మీటర్లతో పెనుభారం
- విద్యుత్ అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలి: తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

**ప్రజావాయిస్, హనుమకొండ జిల్లా ప్రతినిధి:**విద్యుత్ సంస్కరణల పేరుతో దేశ విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. రైతుల మోటార్లకు మీటర్లు బిగించడం ద్వారా వ్యవసాయ రంగంపై మరింత ఆర్థిక భారం మోపేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు.శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో విద్యుత్ పోరాట అమర వీరుల సంస్మరణ దినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరులకు నాయకులు నివాళులర్పించారు. అనంతరం సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో కొత్త చట్టాలను తీసుకొచ్చి విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ దిశగా నడిపిస్తోందని శ్రీనివాసరావు అన్నారు. విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడం వల్ల రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలపై పెనుభారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర జాబితాలోని విద్యుత్ అంశంపై కేంద్రం పెత్తనం చెలాయించడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు.

### అమరుల ఆశయాల సాధనకు పునరంకితం కావాలి

2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల పోరాట స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. నాటి ప్రభుత్వ నిర్బంధాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ధిక్కరించి ప్రజల హక్కుల కోసం ప్రాణాలర్పించిన యోధుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడటమే అమరవీరులకు అర్పించే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు.కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఎన్.అశోక్‌స్టాలిన్, ఏదునూరి వెంకట్రాజం, కొట్టెపాక రవి, మునిగాల భిక్షపతి, వేల్పుల సారంగపాణి, కండె నర్సయ్య, ఆలకుంట్ల యాకయ్య, చిలుకల బాబు, వెంకటేష్, ఉస్మాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# రూ.12.28 కోట్ల బియ్యం కుంభకోణం.. ఇద్దరిపై కేసులు!

- మన ప్రజా వాయిస్ కి విశిష్టమైన స్పందన
- కుంభకోణాన్ని బయటపెట్టిన ప్రజా వాయిస్
- సమిష్ఠ విచారణ చేసి వారిపై కఠిన చర్యలు: పెద్దపెల్లి జిల్లా కలెక్టర్
- మంథని పవన సుత రైస్ మిల్ అక్రమాలు
- ధాన్యం పక్కదారి.. గుట్టు రట్టు!
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బిగ్ యాక్షన్








**ప్రజా వాయిస్ మంథని** మండలంలోని పవన సుత రైస్ మిల్ సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) బియ్యం డిఫాల్ట్ వ్యవహారంపై పెద్దపల్లి జిల్లా యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. కోట్లలో ప్రభుత్వ ధాన్యాన్ని బకాయి పడటంతో పాటు పక్కదారి పట్టించిన మిల్లర్లతో పాటు వారికి సహకరించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు.

### రూ.12.28 కోట్ల డిఫాల్ట్ నిర్ధారణ

ఖరీఫ్, రబీ 2021–22 సీజన్లలో పవన సుత రైస్ మిల్లుకు ప్రభుత్వం 5,798.080 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగించింది. నిబంధనల ప్రకారం 3,891.295 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం అప్పగించాల్సి ఉండగా, మిల్లర్ ఇప్పటివరకు కేవలం 1,069.380 మెట్రిక్ టన్నులు మాత్రమే అందించారు. ఇంకా 2,821.915 మెట్రిక్ టన్నుల బియ్యం (4,211.813 మెట్రిక్ టన్నుల ధాన్యంతో సమానం) బకాయి పడ్డారు. దీని అసలు విలువ రూ.9.82 కోట్లు కాగా, 25 శాతం పెనాల్టీగా రూ.2.45 కోట్లు విధించి.. మొత్తం డిఫాల్ట్ మొత్తాన్ని రూ.12,28,14,365 గా అధికారులు నిర్ధారించారు.

### ఇద్దరిపై క్రిమినల్ కేసులు

పవన సుత రైస్ మిల్లుకు కేటాయించిన ధాన్యాన్ని మంథనిలోని శ్రీలక్ష్మి ఎంఆర్ఎం (సూరయ్యపల్లి) మిల్లుకు అక్రమంగా తరలించినట్లు విచారణలో తేలింది. పీపీసీ ట్రక్ చిట్టీలు, జాయింట్ సంతకాలను పరిశీలించగా శ్రీలక్ష్మి ఎంఆర్ఎం భాగస్వామి వొల్లాల నవీన్ కుమార్ పాత్ర ఉన్నట్లు ఆధారాలు లభ్యమయ్యాయి. దీంతో పవన సుత రైస్ మిల్ యజమాని రావికంటి పవన్ కుమార్, శ్రీలక్ష్మి ఎంఆర్ఎం భాగస్వామి వొల్లాల నవీన్ కుమార్‌లపై కేసులు నమోదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

### రికవరీ ప్రక్రియ వేగవంతం

ప్రభుత్వ ధాన్యం, సీఎంఆర్ బియ్యం విషయంలో అక్రమాలకు పాల్పడే ఏ ఒక్కరినీ ఉపేక్షించేది లేదని కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరించారు. బకాయి పడ్డ ప్రతి రూపాయిని రికవరీ చేయడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## గ్రామపంచాయతీ కార్మికుల పై బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

# అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

**గ్రామపంచాయతీ కార్మికులకు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి క్షమాపణ చెప్పాలి**

**సిఐటియు జిల్లా అధ్యక్షులు R N రమేష్ డిమాండ్**




**ప్రజా వాయిస్.. వనపర్తి**

వనపర్తి జిల్లా చిన్నంబావి మండల కేంద్రంలో ఈరోజు తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో చిన్నంబావి మండల కేంద్రంలో ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు వనపర్తి జిల్లా అధ్యక్షులు R N రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము మాట్లాడుతూ ఈ నెల 24న నిజామాబాద్ జిల్లా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి గ్రామపంచాయతీ కార్మికుల పైన అనిత వ్యాఖ్యలు చేయడం గ్రామపంచాయతీ కార్మికుల వల్లనే గ్రామాల అభివృద్ధి ఆగిపోయిందని వీళ్ల వల్లనే గ్రామాలు చెడిపోతున్నాయని అనుచిత వ్యాఖ్యలు మాట్లాడడం సరైనది కాదని ఈ అనుచిత వ్యాఖ్యలను తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్, సిఐటియు వనపర్తి జిల్లా కమిటీగా ఖండిస్తున్నామని తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికులకు, కారో బార్లకు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి రెడ్డి వెంటనే అనుచిత వ్యాఖ్యలు వాపాస్ తీసుకొని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శి వ్యవస్థ 2000 సంవత్సరంలో ఏర్పడిందని అంతక పూర్వం 1981 నుంచి ప్రతి పంచాయతీ కారోబార్ల నిర్వహణలో పరిపాలన కొనసాగింది అని, కరోబార్లు కేవలం 100 నుండి 200 వేతనం తో పనులు చేస్తూ గ్రామంలో రికార్డుల నిర్వహణ ఇంటి పనులు నల్ల బిల్లులు రెవెన్యూ మరియు పంచాయతీరాజ్ వ్యవస్థలు కలిపిన క్రమంలో రెవెన్యూలో సర్టిఫికెట్ల నిర్వహణ భూముల నిర్వహణ ప్రభుత్వ కార్యక్రమాలైనా రేషన్ కార్డు సర్వే, ఇందిరమ్మల సర్వే, ఎస్ ఐ ఆర్ ఓటర్ నమోదు, ఇతర ఆదాయ వనరులను సమీకరించడంలో వివిధ గ్రామసభల నిర్వహణ, అధికారులు గ్రామాలను సందర్శించిన సందర్భంలో కారోబార్లు ముఖ్య భూమిక పోషించారు. అటువంటి కారోబార్లను అవమానిస్తూ ఒక ప్రజా ప్రతినిధి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైనది కాదు అని తక్షణమే ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కారో బార్లకు క్షమాపణ చెప్పి అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కమిటీల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటాలు నిర్వహించవలసి వస్తుందని ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతి వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు అత్తర్ పాషా, మండల్ అధ్యక్షులు గోపాల్ నాయకులు మాషయ్య, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పాలకుర్తిలో ఘనంగా జంధ్యాల పౌర్ణమి వేడుకలు

**ప్రజా వాయిస్/పాలకుర్తి**

జంజిరాల పౌర్ణమి (నూలు పోగుపౌర్ణమి)ని పురస్కరించుకొని శుక్రవారం జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో గల పద్మశాలిలు భక్త మార్కండేయ మహర్షికి సమర్పించే పట్టు వస్త్రాలను కుల పెద్ద చిలుకమారి ఉప్పలయ్య ఇంటి నుండి పద్మశాలిలు బ్యాండ్ మేళాలతో గుడివాడ చౌరస్తాలో గల ఓంకారేశ్వర ఆలయం(పంచగుళ్ల) దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు, తదనంతరం ఓంకారేశ్వర ఆలయం(పంచగుళ్ల) దేవాలయ ఆలయ అర్చకులు గంగు రఘు శర్మ శ్రీ భక్త మార్కండేయ స్వామికి పంచామృతాభిషేకం ,గణపతి హోమము, యజ్ఞోపవిత ధారణ జరిపారు, అనంతరం పద్మశాలి లు జంజిరాలను. యజ్ఞోపవితాదారణ చేసి, గాయత్రీ మంత్రం షోడశ ఉపచార పూజతో, మార్కండేయ పూజతో ఉచ్చరించి భక్తి



శ్రద్ధలతో జంజిరాలను ధరించారు. నూలు పోగు ఉద్భవించిన పవిత్రమైన నూలు పౌర్ణమి, రక్షా బంధన్ ను పట్టణ పద్మశాలిలు ఘనంగా జరుపుకున్నారు, ఈ కార్యక్రమంలో దేవస్థాన ఈవో లక్ష్మీ ప్రసన్న, పాలకుర్తి పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు చిలుకమారి వెంకటేశ్వర్లు,పోపా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చిదురాల ఎల్లయ్య , సలహాదారులు కాటబత్తిని రమేష్, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర విద్యార్థి సంఘం అధ్యక్షుడు డాక్టర్ మేడారపు సుధాకర్, చేనేత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు కూరపాటి సుదర్శన్, మండల ప్రధాన కార్యదర్శి చిలుకమారి సోమేశ్వర్, ప్రముఖ జర్నలిస్టు మార్గం లక్ష్మినారాయణ,పట్టణ ప్రధాన కార్యదర్శి చిదురాల మార్కండేయ,నాగన్న, దేవేందర్, పట్టణ పద్మశాలి సంఘ నాయకులు కాటబత్తిని సోమేశ్వర్, పెనుగొండ వెంకటేశ్వర్లు, వైట్ల పుండరీకుడు, మేడారపు సోమనారాయణ,ఎనగందుల శ్రీనివాస్, గూడెల్లి సోమశేఖర్, ఉపేందర్, చిలుకమారి రమేష్, సోమనర్సయ్య, వైట్ల శ్రీహరి, చిలుకమారి సమ్మయ్య, కుమార్, హరికృష్ణ, కుమారస్వామి, వెంకన్న, పెనుగొండ కిష్టయ్య, గౌరయ్య, ఉప్పలయ్య, కూరపాటి అభిలాష్, యాకయ్య లతో పాటు ఆలయ సిబ్బంది రాములు, రమేష్ తదితరులు కులస్తులు అందరూ పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు తక్షణమే విడుదల చేయాలి

**బహుజనులకు విద్యను దూరం చేస్తున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు**

**జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్**





**ప్రజా వాయిస్ కొత్తగూడెం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలంలో రాష్ట్రంలోని పేద,బడుగు,బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని జై భీమ్ రావ్ భారత్ పార్టీ జే.బీ.పీ,స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ డిమాండ్ చేశారు.మండలంలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా సుమారు 14 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థుల చదువుకు ఈబకాయిల సమస్య తీవ్ర ఆటంకంగా మారిందన్నారు.ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొండివైఖరి అవలంబిస్తూ,విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమడుతున్నారని మండిపడ్డారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఇక్కడ దీక్షలు చేయడం మానేసి ఢిల్లీలో దీక్షలు చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు సుమారు రూ.1,500 కోట్లు విడుదల చేయించి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని హితవు పలికారు.బీజేపీ నేతలు "ఫీజు బకాయి బీజేపీ లడాయి" అంటూ ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ,గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్,కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ..ఈ మూడు పార్టీలు ఎస్సీ,ఎస్టీ,బీసీ వర్గాల విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు.బహుజనులు ఉన్నత విద్యను అభ్యసించడం ఈ పార్టీలకు ఇష్టం లేదని,విద్యను బహుజనులకు దూరం చేయడమే వాటి లక్ష్యంగా కనిపిస్తోందని విమర్శించారు.బహుజన విద్యార్థుల విద్యా హక్కులను కాపాడుకునేందుకు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని యెర్రా కామేష్ పిలుపునిచ్చారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని,లేనిపక్షంలో విద్యార్థుల పక్షాన జేబీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో జేబీపీ జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున రావు,జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్,వినయ్,సోనూ,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఆనందోత్సాహాల నడుమ

# ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

**ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా**

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా రాఖీ పౌర్ణమి పండుగను ప్రజలు అత్యంత వైభవంగా, ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. తొగుట, దుబ్బాక, హుస్నాబాద్ ప్రాంతాల్లో అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ వేడుకలు కన్నులపండువగా సాగాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు కొత్త దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉద్యోగాలు, చదువుల నిమిత్తం దూరప్రాంతాల్లో ఉన్న సోదరసోదరీమణులు స్వగ్రామాలకు చేరుకోవడంతో మండలాల్లోని పల్లెలన్నీ పండుగ శోభతో ముస్తాబయ్యాయి. అక్కాచెల్లెళ్లు తమ సోదరుల మణికట్టుకు రాఖీలు కట్టి వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలను ఆకాంక్షించగా, సోదరులు సైతం తమ సోదరీమణులకు ఆత్మీయ కానుకలు అందించి ప్రేమాభిమానాలను చాటుకున్నారు.దుబ్బాక నియోజకవర్గంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ పండుగను వేడుకగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సోదరి మమత శ్రీధర్ రెడ్డి, సోదరులైన తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి, అమర్, చెరుకు అజయ్ రెడ్డిలతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. సోదరి మమత తన సోదరులకు రాఖీ కట్టి పండుగ విశిష్టతను తెలిపార. ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మానవ జీవితంలో సోదరసోదరీమణుల బంధానికి ఎంతో ప్రాధాన్యత ఉందని, ఆ ఆత్మీయ అనుబంధాన్ని రాఖీ పండుగ మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో ఈ పండుగ ప్రేమానురాగాలను, శాంతి, సౌభ్రాతృత్వాన్ని నింపాలని ఆకాంక్షించారు.హుస్నాబాద్ నియోజకవర్గంలోనూ రాఖీ పౌర్ణమి వేడుకలు కోలాహలంగా సాగాయి. రక్షాబంధన్ అంటే కేవలం చేతికి కట్టే దారం మాత్రమే కాదని, జీవితాంతం ఒకరికొకరు తోడుగా నిలిచే రక్షణ, ఆత్మీయతలకు దివ్యమైన గుర్తు అని స్థానికులు చాటిచెప్పారు. ఆర్థిక స్థోమతలు, అంతస్తులు, ప్రాంతీయ భేదాలు లేకుండా సోదరభావంతో మెలగాలనే గొప్ప సందేశాన్ని ఈ పండుగ అందిస్తుంది. అంతేకాకుండా సమాజంలో మహిళల గౌరవాన్ని, భద్రతను కాపాడాల్సిన బాధ్యతను గుర్తుచేస్తూ, జిల్లా వ్యాప్తంగా



సోదరసోదరీమణుల మధ్య ప్రేమానురాగాలను పెంపొందిస్తూ రక్షాబంధన్ వేడుకలు అత్యంత ఆత్మీయ వాతావరణంలో ముగిసాయి.



# రాష్ట్ర క్రీడల్లో సూర్యాపేట సత్తా

**ఆటియా పాటియా పోటీలకు జిల్లా విద్యార్థుల ఎంపిక**

**29, 30న నిర్మల్‌లో రాష్ట్రస్థాయి పోటీలు**

**ప్రజా వాయిస్, కోదాడ**

జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 29, 30 తేదీల్లో నిర్మల్‌లో నిర్వహించనున్న జూనియర్స్ ఆటియా పాటియా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల చిలుకూరు, సూర్యాపేట విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా తరఫున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటేందుకు విద్యార్థులు సిద్ధమయ్యారు.ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మధు విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సూర్యాపేట జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇన్‌చార్జి ఏటీపీ జానీమియా, పీఈటీలు రాజ్‌కుమార్, మట్టయ్య, ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించి పోటీలకు పంపించారు.



## శంషాబాద్‌లో ఏఐటీయూసీ

# మహాసభల సందడి

**కరీంనగర్‌లో సెప్టెంబర్ 6,7,8,తేదీల్లో రాష్ట్ర 4వ మహాసభలు**

**మహాసభలకు కార్మికులు భారీగా తరలిరావాలి: ఏఐటీయూసీ నాయకులు**

ప్రజా వాయిస్/శంషాబాద్:కరీంనగర్‌లో సెప్టెంబర్ 6,7,8 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఏఐటీయూసీ 4వ మహాసభలకు సన్నాహకంగా శంషాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం గోడపత్రికను ఆవిష్కరించారు.సీపీఐ మండల కార్యదర్శి,భవన నిర్మాణ,సంఘం రాష్ట్ర నాయకులు నర్రగిరి ముఖ్య అతిథిగా పాల్గొని గోడపత్రికను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలు . కార్మికుల హక్కులపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు.శంషాబాద్ మండలం నుంచి కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి గిలక రాజు,అధ్యక్షుడు శ్రీను, భవన నిర్మాణ సంఘం మండల అధ్యక్షుడు ఎద్దుల శ్రీను,ఉపాధ్యక్షుడు దండు రవి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జంధ్యాల ధారణ

**ప్రజా వాయిస్ దౌల్తాబాద్, ఆగస్టు 28:**

రాఖీ పౌర్ణమి సందర్భంగా దౌల్తాబాద్ మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జంధ్యాల ధారణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సంప్రదాయబద్ధంగా జంధ్యాలను ధరించారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ సంప్రదాయాలు, ఆచారాలను పరిరక్షిస్తూ వాటిని భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో ఏటా జంధ్యాల ధారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సిరిగారి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సాంబారపు సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ, కోశాధికారి పెంద్యం ప్రసాద్తో పాటు పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## తీజ్ పండుగ ఉత్సవాలలో అతిధిగా పాల్గొన్న ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజా వాయిస్/రాయపర్తి

వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బాలు నాయక్ తండా' గ్రామం గొప్య తండాలో స్థానిక ప్రజల పిలుపు మేరకు తీజ్ పండుగ ఉత్సవాలలో పాల్గొనాలని కోరగా శుక్రవారం తండా ను సందర్శించి, తండా ప్రజలకు తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన.ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు చిన్నపాక రాంబాబు, గుగులోత్ రమేష్ మండల పార్టీ నాయకులు పోతుల కొమురుమల్లు, సంకినేని ఎల్లస్వామి, కోలా సంపత్, భూక్య వెంకన్న, భూక్య బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## అక్కాచెల్లెమ్మల దీవెనలు కాంగ్రెస్‌కు ఉండాలి

**రాఖీ సోదర ప్రేమానురాగాలకు ప్రతీక: ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

ప్రజావాయిస్/స్టేషన్‌ఘనపూర్:



రాఖీ పౌర్ణమి సందర్భంగా స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ ప్రజలతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో రక్షాబంధన్‌కు విశిష్ట స్థానం ఉందన్నారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆప్యాయతలకు రాఖీ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా సోదరభావాన్ని చాటే గొప్ప పండుగ రక్షాబంధన్ అని అన్నారు.మహిళల సంక్షేమం, భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కడియం శ్రీహరి తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు, సబ్సిడీ రుణాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. నియోజకవర్గంలోని అక్కాచెల్లెమ్మల చల్లని దీవెనలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉండాలని కోరారు. రాఖీ పౌర్ణమి ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## ఎంపీకి రాఖీ కట్టిన కౌన్సిలర్లు

**-చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి రాఖీ కట్టి శుభాకాంక్షలు**

**- మోత్కూర్‌లో ఎంపీకి కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధుల ఘన స్వాగతం**



ప్రజా వాయిస్,మోత్కూర్:

భువనగిరి ఎంపీ, టీపీసీసీ మీడియా అండ్ పబ్లిక్ కమ్యూనికేషన్స్ చైర్మన్ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి మోత్కూర్‌లో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అడ్డగూడూరు మండలం లక్ష్మీదేవికాలువ గ్రామంలో ఇటీవల మృతిచెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వల్లంబట్ల వేణు కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న ఎంపీకి శుక్రవారం స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మోత్కూర్ మున్సిపల్ కౌన్సిలర్లు మెంట రమణ నగేష్, కుర్మిళ్ల ప్రమీల ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి రాఖీ కట్టి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సోదరభావానికి ప్రతీకగా రాఖీ కట్టి ఆత్మీయతను చాటుకున్నారు.కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న, పొడిచేడు సర్పంచ్ సైదులు, అనాజీపూర్ సర్పంచ్ వెంకన్న, మార్కెట్ డైరెక్టర్ ఎండీ సమీరుద్దీన్, జీ. నర్సింహా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్, కిరణ్, మహమ్మద్ షాకిరుద్దీన్, శ్రావణ్, రాహుల్, రామనరసయ్య, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

**వాట్సాప్, మెయిల్‌లో వచ్చిన ఫిర్యాదులపైనా స్పందించాలి: మంత్రి జూపల్లి**

**కార్యాలయాల చుట్టూ ప్రజలను తప్పుకోవద్దు**

**వినతులు వచ్చిన వారం రోజుల్లో ప్రజల సమస్యలను పరిష్కరించాలి**

**అధికారులకు మంత్రి జూపల్లి దిశా నిర్దేశం**

ప్రజా వాయిస్.. వనపర్తి

వనపర్తి జిల్లాపానగల్, మండల ప్రజలు తమ సమస్యలను రాతపూర్వకంగా తెలియజేసి వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా పంపినా అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. పానగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రోడ్లు-భవనాలు, పంచాయతీరాజ్, నీటిపారుదల, రెవెన్యూ, వ్యవసాయం, విద్యుత్ పోలీస్, దేవాదాయ, అటవీ, పౌరసరఫరాలు తదితర శాఖలకు సంబంధించి ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై అధికారులు తీసుకున్న చర్యలు, ఇంకా పరిష్కరించాల్సిన సమస్యలపై మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష నిర్వహిస్తున్నారు.గత రెండున్నరేళ్లలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు సమర్పించిన ఫిర్యాదులు, వాటిలో పరిష్కరించినవి, పెండింగ్‌లో ఉన్న వాటిపై ఆరా తీశారు.మండలానికి సంబంధించి మొత్తం 489 వినతులు అందగా, 373 వినతులపై అధికారులు చర్యలు తీసుకున్నారు. మరో 50 వినతులను పరిష్కరించాల్సి ఉందని,ముఖ్యంగా నీటిపారుదల శాఖకు సంబంధించి వినతులు రాగా, 60 అర్జీలను పరిష్కరించగా,19 ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే తహసీల్దార్, పాన్ గల్ పరిధిలో 99 వినతులు రాగా, 68 అర్జీలను పరిష్కరించగా, మరో 31 పరిష్కరించాల్సి ఉంది.సాంకేతికత అందుబాటులోకి వచ్చిన ప్రస్తుత తరుణంలో సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ప్రభుత్వ



కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తులను పరిష్కరించేలా అధికారుల పనితీరులో మార్పు రావాలని మంత్రి జూపల్లి దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు తమ రోజువారీ పనుల్లో నిమగ్నమై ఉంటారని, ఒక సమస్య కోసం నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదన్నారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను గరిష్ఠంగా వారం రోజుల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను రెండు, మూడు రోజుల్లోనే జారీ చేయాలని సూచించారు.ప్రజలు తమ సమస్యలను రాతపూర్వకంగా పేర్కొని, చిరునామా, ఫోన్ నంబరు వివరాలతో సంబంధిత శాఖాధికారులకు వాట్సాప్ లేదా ఈ-మెయిల్ ద్వారా పంపుకోవచ్చన్నారు. వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను కూడా అధికారులు ప్రింట్ తీసుకుని సంబంధిత రికార్డుల్లో నమోదు చేసి, వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉందన్నారు.

**పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి**

అనంతరం ఇప్పటివరకు పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, సంబంధిత శాఖల అధికారుల సమక్షంలో మంత్రి సమీక్షించారు. పలు సమస్యలను అధికారులతో అక్కడికక్కడే పరిష్కరించారు.రెవెన్యూ సమస్యలపై ముందుగా సమీక్ష నిర్వహించారు. ఫిర్యాదుదారులు తమ భూ సమస్యలపై సమర్పించిన దరఖాస్తులను ఒక్కొక్కటిగా పరిశీలించి, పెండింగ్‌కు కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలను సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై కూడా మంత్రి సమీక్షించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఇందిరమ్మ ఇళు మంజూరైనప్పటికీ ఆర్థిక స్థోమత లేక నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. తదుపరి సమీక్ష సమావేశంలో ఆయా లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు నాలుగో విడత నిధులు మంజూరు చేయాలని ఆదేశించారు.విద్యుత్ శాఖతో పాటు ఇతర శాఖలకు సంబంధించిన ప్రజా సమస్యలను కూడా మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు తమ సమస్యలను రాతపూర్వకంగా మంత్రికి అందజేశారు.

**మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కరించాలి: కలెక్టర్**

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు మండల స్థాయిలోనే పరిష్కరించాలని మండల స్థాయి అధికారులను ఆదేశించారు. ప్రజలు జిల్లా స్థాయి కార్యాలయాల వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు.ఈ సమీక్షలో అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్, గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతి, ఏడీ శ్రీనివాసులు, ఆర్డీఓ సుబ్రమణ్యం, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తూప్రాన్ సుష్మా హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స

**45 ఏళ్ల గిరిజన మహిళ కడుపులో 5 కిలోల కణితి తొలగింపు..**

**రక్తహీనతతో ప్రాణాపాయ స్థితిలో ఉండగా విజయవంతంగా ఆపరేషన్**

తూప్రాన్, ప్రజా వాయిస్

తీవ్రమైన కడుపునొప్పి, నెలసరి సమయంలో అధిక రక్తస్రావంతో కొంతకాలంగా బాధపడుతున్న ఓ గిరిజన మహిళకు తూప్రాన్‌లోని సుష్మా హాస్పిటల్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి కడుపులో ఉన్న భారీ కణితిని విజయవంతంగా తొలగించారు. సుమారు 5 కిలోల బరువున్న కణితిని శస్త్రచికిత్స ద్వారా తొలగించడంతో బాధితురాలు ప్రస్తుతం కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు.సిద్ధిపేట జిల్లా వర్గల్ మండలం సీతారాంపల్లి తండాకు చెందిన అజ్మీరా రమేష్ భార్య అజ్మీరా సజ్జి (45) గత కొంతకాలంగా నెలసరి సమయంలో అధిక రక్తస్రావంతో పాటు తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నారు. క్రమంగా ఆమె ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో కుటుంబ సభ్యులు వైద్యులను సంప్రదించారు.

**స్కానింగ్‌లో బయటపడిన భారీ కణితి**

ఈ నెల ఆగస్టు 21న స్కానింగ్ నిర్వహించగా, సజ్జి కడుపులో సుమారు 5 కిలోల బరువున్న భారీ కణితి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. కణితి కారణంగా ఆమెకు నెలసరి సమయంలో అధిక రక్తస్రావం జరుగుతుండటంతో శరీరంలో రక్తం గణనీయంగా తగ్గిపోయింది. దీంతో ఆమె హిమోగ్లోబిన్ స్థాయి కేవలం 6 గ్రాములకు పడిపోయింది.

తీవ్రమైన రక్తహీనత కారణంగా ఆమె ఎంతో నీరసంగా ఉండటంతో పాటు కళ్లుతిరగడం, ఆకలి లేకపోవడం వంటి సమస్యలతో బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తించారు. పరిస్థితిని అత్యవసరంగా పరిగణించిన వైద్య బృందం ముందుగా అవసరమైన వైద్య చర్యలు చేపట్టి బి పాజిటివ్ గ్రూపు రక్తాన్ని ఎక్కించి శస్త్రచికిత్సకు సిద్ధం చేసింది.

**నిష్ణాతులైన వైద్యుల ఆధ్వర్యంలో ఆపరేషన్**

స్కానింగ్ రిపోర్టులను నిశితంగా పరిశీలించిన అనంతరం ఆగస్టు 22న సుష్మా హాస్పిటల్‌లో నిష్ణాతులైన వైద్య బృందం శస్త్రచికిత్స నిర్వహించింది. కడుపులో ఇంత భారీ కణితి ఉండటాన్ని గుర్తించి, రోగి ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసి, అవసరమైన రక్తాన్ని అందుబాటులో ఉంచి, నిపుణుల బృందంతో శస్త్రచికిత్స చేయడం ద్వారా రోగికి మెరుగైన వైద్యం అందించగలిగామని ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి.

**సకాలంలో వైద్య పరీక్షలు అవసరం**

నెలసరి సమయంలో అధిక రక్తస్రావం, తరచూ కడుపునొప్పి, నీరసం, తల తిరగడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని వైద్యులు సూచిస్తున్నారు.సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా శరీరంలో ఏర్పడే సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. తూప్రాన్‌లోని సుష్మా హాస్పిటల్‌లో నిష్ణాతులైన వైద్య బృందం ఆధ్వర్యంలో 5 కిలోల భారీ కణితిని విజయవంతంగా తొలగించడంతో రోగి కుటుంబ సభ్యులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

**గైనకాలజిస్ట్**

సర్జన్ డాక్టర్ హేమ్రాజ్ సింగ్, డాక్టర్ శ్రవణ్ కుమార్, అనస్తీషియా వైద్యులు డాక్టర్ తిరుపతి, డాక్టర్ ప్రదీప్ సింహ, డాక్టర్ సుష్మాదేవి నేతృత్వంలో వైద్య బృందం ఎంతో జాగ్రత్తగా శస్త్రచికిత్స చేసి కడుపులో ఉన్న సుమారు 5 కిలోల కణితిని విజయవంతంగా తొలగించింది. తీవ్రమైన రక్తహీనతతో ఉన్న రోగికి శస్త్రచికిత్స నిర్వహించడం వైద్య బృందానికి సవాల్‌గా ఉన్నప్పటికీ, ముందస్తు వైద్య ఏర్పాట్లు, నిపుణుల పర్యవేక్షణతో ఆపరేషన్ విజయవంతంగా పూర్తయింది.

**వైద్యుల సమన్వయంతో విజయవంతమైన చికిత్స**

ఈ ప్రత్యేక శస్త్రచికిత్స విజయవంతం కావడంలో వైద్యులతో పాటు ఆసుపత్రి సిబ్బంది సమన్వయం కీలకంగా నిలిచింది. 28వ తేదీ శుక్రవారం ఉదయం పేషెంట్ ఆరోగ్యంగా ఉండటం తో డిశ్చార్జి చేసినట్లు డాక్టర్ ప్రదీప్ సింహ తెలిపారు.శస్త్రచికిత్స సమయంలో స్టాఫ్ లక్ష్మి, ఆర్. సునీత, సందీప్, సుమన్, నవీన్, రజనీకాంత్ తదితరులు వైద్య బృందానికి సహకరించారు.




# భారతదేశ మహిళలే దేశానికి అతి గొప్ప బలం

**మహిళలు తమ హక్కులు తామే సాధించుకోవాలి**

**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ**

ప్రజా వాయిస్, ఆగష్టు 28

భారతదేశ మహిళలే దేశానికి అతి గొప్ప బలమని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాడ్‌కాస్ట్‌లో అన్నారు. అయితే చిన్ననాటి నుంచే మహిళలను సమాజం నిర్దేశించిన గుర్తింపులు, పరిమితులకే కట్టిపడేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.తాజా పాడ్‌కాస్ట్‌లో మహిళల సాధికారత, స్వేచ్ఛ, సమానత్వంపై రాహుల్ గాంధీ తన అభిప్రాయాలను వెల్లడించారు. మహిళల ఎంపికలను, వారి వస్త్రధారణను , సమయాన్ని నియంత్రించాలనే పాత సామాజిక ఆలోచనా ధోరణి మారాల్సిన అవసరం ఉందన్నారు.మహిళల హక్కుల కోసం జరిగే పోరాటం కేవలం ఒక్క చట్టం కోసం లేదా ఒక ఘటనకు వ్యతిరేకంగా మాత్రమే పరిమితం కాకూడదని ఆయన పేర్కొన్నారు. మహిళలను అణచివేసే పాత ఆలోచనా విధానాలపై కూడా నిరంతర పోరాటం సాగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు."సంకెళ్లు తెంచుకోండి.. మీ హక్కులు మీరే సాధించుకోండి"అని ప్రతి మహిళకు పిలుపునిస్తూ




రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. సమాజం విధించే పరిమితులను అధిగమించి మహిళలు తమ స్వరాన్ని బలంగా వినిపించాలని అన్నారు. ఆత్మవిశ్వాసంతో, గర్వంగా నిలబడాలని.. తమకు చెందాల్సిన హక్కులు మరెవరూ ఇచ్చే వరకు ఎదురుచూడకుండా తామే సాధించుకోవాలని పిలుపునిచ్చారు.మహిళల స్వేచ్ఛ, గౌరవం, సమాన అవకాశాలు కేవలం మహిళల సమస్యలు మాత్రమే కాదని, అవి సమాజ పురోగతికి సంబంధించిన అంశాలని చెప్పేలా ఆయన సందేశం సాగింది. మహిళలను నిర్ణయాలు తీసుకునే స్థాయిలో నిలబెట్టినప్పుడే దేశం తన పూర్తి సామర్థ్యాన్ని సాధించగలదనే భావనను రాహుల్ గాంధీ వ్యక్తం చేశారు.మహిళలను నియంత్రించే సంకెళ్లు తెగినప్పుడే సమాజం నిజమైన అర్థంలో స్వేచ్ఛను పొందుతుంది అనే సందేశాన్ని ఈ పాడ్‌కాస్ట్ ద్వారా ఆయన బలంగా ముందుకు తీసుకొచ్చారు.

# భారత్‌లో బలపడుతున్న అంబేద్కర్ భావజాలం

### విగ్రహాల నుంచి విధానాల దాకా...
### అణచివేత నుంచి ఆత్మగౌరవం వైపు..
### సమానత్వం కోసం కొత్తతరం అడుగులు

**ప్రజా వాయిస్, హుజూర్ నగర్, ఆగష్టు 28**

భారత సమాజంలో మార్పు అనేది కేవలం రాజకీయ అధికార మార్పుతోనే పరిమితం కావడం లేదు. సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం, రాజ్యాంగ హక్కులపై పెరుగుతున్న చైతన్యం దేశ సామాజిక స్వరూపాన్నే ప్రభావితం చేస్తోంది. ఈ మార్పులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనలు మరోసారి కీలక చర్చగా మారుతున్నాయి.ఒకప్పుడు అంబేద్కర్ పేరు ప్రధానంగా దళిత, బహుజన వర్గాల హక్కుల పోరాటంతో ముడిపడి ఉండేది. ఇప్పుడు పరిస్థితి మారుతోంది. కుల వివక్షకు వ్యతిరేకత, విద్య ద్వారా సాధికారత, రాజ్యాంగ పరిరక్షణ, సమాన అవకాశాలు, మహిళల హక్కులు, ప్రజాస్వామ్య విలువలు వంటి అంశాలపై యువతలో చర్చ పెరుగుతోంది. అంబేద్కర్ ఆలోచనల్లోని సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్య భావనలు నేటి తరానికి కొత్త అర్థాలను ఇస్తున్నాయి.

**చదువే ఆయుధం.. రాజ్యాంగమే రక్షణ**

విద్య, సంఘటితం కావడం, హక్కుల కోసం పోరాడటం అనే దిశలో అంబేద్కర్ చూపిన మార్గం నేటికీ అనేక సామాజిక ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలుస్తోంది. విద్యావకాశాలు, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక గౌరవం వంటి అంశాల్లో వెనుకబడిన వర్గాల గొంతుక బలపడటానికి ఈ భావజాలం ఒక సాధనంగా మారుతోంది.రిజర్వేషన్లు, సామాజిక న్యాయం వంటి అంశాలపై జరుగుతున్న ప్రస్తుత చర్చలు కూడా అంబేద్కర్ ఆలోచనల ప్రాసంగికతను మరోసారి ముందుకు తెస్తున్నాయి. ఇటీవల కూడా రిజర్వేషన్లను రాజ్యాంగ హక్కుగా పేర్కొంటూ, కుల వ్యవస్థ కొనసాగుతున్నంతకాలం సామాజికంగా వెనుకబడిన వర్గాలకు రక్షణ అవసరమనే వాదనలు వినిపించాయి.

**విగ్రహాల నుంచి విధానాల దాకా...**


అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేయడం, జయంతి వేడుకలు నిర్వహించడం మాత్రమే అంబేద్కర్‌ను గౌరవించడం కాదనే భావన కూడా క్రమంగా బలపడుతోంది. అంబేద్కర్‌ను విగ్రహంలో కాకుండా విధానాల్లో చూడాలి.. పుస్తకాల్లో కాకుండా ప్రజల జీవితాల్లో అమలు చేయాలి అనే చైతన్యం పెరుగుతోంది.అయితే మరోవైపు అంబేద్కర్ విగ్రహాల ధ్వంసం వంటి ఘటనలు కూడా సామాజిక ఉద్రిక్తతలను బయటపెడుతున్నాయి. ఇటీవల మధ్యప్రదేశ్‌లో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం కావడంతో స్థానికులు నిరసనకు దిగిన ఘటన దీనికి తాజా ఉదాహరణ.

**రాజకీయాలకు అతీతంగా అంబేద్కర్**

అంబేద్కర్‌ను ఒక కులానికి, ఒక వర్గానికి లేదా ఒక రాజకీయ పార్టీకి మాత్రమే పరిమితం చేయడం ఆయన ఆలోచనల విస్తృతిని తగ్గించడమే. రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడి గౌరవం, స్వేచ్ఛ, హక్కులు, సమానత్వం రక్షించాలన్న ఆయన దృక్పథం భారత ప్రజాస్వామ్యానికి కీలకమైనది. అందుకే నేటి యువతలో అంబేద్కర్‌పై పెరుగుతున్న ఆసక్తి కేవలం ఒక నాయకుడిపై అభిమానంగా చూడలేం. అది తమ హక్కులపై అవగాహన పెరుగుతున్న సంకేతంగా కూడా చూడవచ్చు.

**మార్పు మొదలైంది...**

భారతం మారుతోంది. కొత్త తరం ప్రశ్నిస్తోంది. అన్యాయం ఎక్కడ కనిపించినా ప్రశ్నించే ధైర్యం పెరుగుతోంది. కులం కంటే ప్రతిభ, జన్మ కంటే హక్కు, వివక్ష కంటే సమానత్వం, ఆధిపత్యం కంటే ప్రజాస్వామ్యం కావాలనే ఆకాంక్ష బలపడుతోంది. అందుకే నేటి భారతంలో అంబేద్కర్




భావజాలం పెరుగుతుండటం ఒక వ్యక్తి ఆరాధనకు పరిమితమైన పరిణామం కాదు. సమాజాన్ని సమానత్వం వైపు నడిపించే ఆలోచనలకు పెరుగుతున్న ఆదరణకు ఇది సంకేతం.అంబేద్కర్‌ను ఎంతగా స్మరిస్తున్నామన్నది కాదు... ఆయన చూపిన సమానత్వ మార్గంలో ఎంత దూరం నడుస్తున్నామన్నదే మారుతున్న భారతానికి అసలైన కొలమానం.

# ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శిగా చాంద్ పాషా

**జూలూరుపాడు, ప్రజా వాయిస్:**




అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శిగా జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం గ్రామానికి చెందిన ఎస్ కె చాంద్ పాషా ఎన్నికయ్యారు. భద్రాద్రి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఏఐవైఎఫ్ జిల్లా మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. యువతకు నిరుద్యోగ భృతి అందించాలని, ప్రభుత్వ శాఖల్లో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలను అప్పగించిన భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషాతో పాటు జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# దివ్యాంగుల నావకు తెరచాప మంద కృష్ణ మాదిగ

### ఎమ్మార్పీఎస్ నాయకులు సాయికుమార్




**జూలూరుపాడు, ప్రజా వాయిస్:**

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్పీఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండల కేంద్రంలో శు క్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సాధన సమితి నాయకుడు భూక్యా బాలు పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు దెబ్బెందుల సాయికుమార్ మాట్లాడుతూ దివ్యాంగుల నావకు తెరచాప మందకృష్ణ మాదిగ అని అన్నారు. దివ్యాంగుల ఉద్యమాలకు పోరుబాట చూపిన ఘనత మందకృష్ణ మాదిగ కే దక్కుతుందన్నారు.వికలాంగుల పెన్షన్ పెంపు మందకృష్ణ మాదిగ ఆమరణ నిరాహార దీక్ష చేసి సాధించారని తెలిపారు. వికలాంగుల బాధలు, కష్టాలు ఏ పార్టీ కాని, పాలకులు కానీ గుర్తించకపోవడం బాధాకరమన్నారు. ఎమ్మార్పీఎస్ అండతో నిరాహార దీక్షలు, మహా గర్జన లాంటి సభల ద్వారా గర్జించి వికలాంగుల పెన్షన్ పెంపును సాధించటం జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కాకటి కృష్ణ, చాపలమడుగు నరసింహారావు, మంద బాబు విహెచ్పిఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పల్లె వెలుగు పేరు... ఎక్స్‌ప్రెస్ తీరు

### ఆగాల్సిన చోట ఆగని పల్లె వెలుగు
### మిర్యాలగూడ, కోదాడ మార్గంలో ప్రయాణికుల అవస్థలు
### కొరవడిన ఆర్టీసీ అధికారుల నిఘా

**ప్రజా వాయిస్, హుజూర్ నగర్, ఆగష్టు 28**

పేరుకే పల్లె వెలుగు కానీ పల్లెల్లో వెలుగు చూపడం లేదు. పల్లె పల్లెనా ఆగాల్సిన బస్సు పల్లెను చూస్తేనే పరుగులు తీస్తోంది. గ్రామాల్లో ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాల్సిన పల్లె వెలుగు బస్సుల తీరుపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు, రైతులు, కూలీలు, మహిళలు ఈ బస్సులపైనే ఆధారపడి బతుకుతున్నారు. కానీ డ్రైవర్ల నిర్లక్ష్యం, కండక్టర్ల దురుసు ప్రవర్తనతో వారి ప్రయాణం నరకంగా మారింది.

**స్టాప్ ఉన్నా బస్సు ఆగదు**

మిర్యాలగూడ నుండి కోదాడ వెళ్లే దారిలో దాదాపు 15




పల్లెలు (గ్రామాలు) ఉన్నాయి. ఆయా పల్లెల్లో బస్టాపులు ఉన్నా బస్సు ఆగడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.చేతులెత్తి ఆపినా ఆపరని రోడ్డు మీద నిలబడి అరిచినా పట్టించుకోకుండా హారన్ కొట్టుకుంటూ వెళ్లిపోతారని తర్వాత బస్సు ఎప్పుడు వస్తుందో తెలియదని గంటల తరబడి ఎండలో నిలబడాల్సి వస్తుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.వృద్ధులు,గర్భిణీలను చూసినా కనికరం లేదని బస్సు పూర్తిగా ఆపకుండానే ఎక్కమంటూ అరుస్తున్నారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు భయపడుతున్నారు.

**టైం కవర్ చేయాలంటూ ప్రాణాలతో చెలగాటం**

ఎందుకు ఆపడం లేదని అడిగితే టైం లేదు, ట్రిప్ కవర్ చేయాలి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ప్రయాణికులు మండి పడుతున్నారు. పల్లె వెలుగు అంటేనే పల్లెల కోసం కానీ ఇక్కడ పల్లెలను విస్మరించి ఎక్స్‌ప్రెస్ బస్సులా నడుపుతున్నారు. ఈ రూట్లో ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లోపించింది. ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు.మిర్యాలగూడ, కోదాడ పల్లె వెలుగు బస్సులు ప్రతి గ్రామ పంచాయతీ స్టాప్ వద్ద తప్పని సరిగా ఆగాలని, ఇష్టానుసారంగా బస్సులు ఆపకుండా వెళ్లే డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని, రద్దీ సమయంలో అదనపు బస్సులు నడపాలని, డిపో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి పల్లె బస్సును నిజంగా పల్లెల్లో ఆపేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.






# సీఎం,ఆలేరు ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన మోత్కూరు మార్కెట్ చైర్మన్

**ప్రజా వాయిస్, మోత్కూరు, (ఆగస్టు28):**

రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మార్కెట్ చైర్మన్ నూనెముంతల విమల వెంకటేశ్వర్లు గౌడ్ శు క్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో స్వయంగా కలిసి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను కూడా కలిసి విమల రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోదర అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగను పురస్కరించుకుని వారికి రాఖీలు కట్టి ఆత్మీయతను చాటుకున్నారు.

# దేశంలో మహిళల పరిస్థితి ఏమవుతుంది..?
# సెన్సార్ బోర్డు కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలి..!





**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 28, సెంట్రల్ డెస్క్:**

దక్షిణాది సూపర్ స్టార్ యష్ నటించిన ‘టాక్సిక్’ చిత్రం విడుదలైన మరుసటి రోజే వివాదంలో చిక్కుకుంది. పలువురు ప్రముఖ నటులు నటించిన ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా చిత్రంపై, మహిళలను మితిమీరిన శృంగార కోణంలో చూపించడం, వివక్షాపూరిత వైఖరిని ప్రదర్శించడం వంటి ఆరోపణలు వస్తున్నాయి.మాజీ బీజేపీ నాయకుడు, ‘వీ ద లీడర్స్’ వ్యవస్థాపకుడు అయిన కె. అన్నామలై, మహిళల పట్ల వివక్షాపూరిత వైఖరిని ప్రదర్శించినందుకు గాను ఈ చిత్రాన్ని విమర్శించారు. అలాగే, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన ఆయన, ఈ చిత్రానికి ఆమోదం తెలిపిన ఆ సంస్థ నిర్ణయాన్ని ప్రశ్నించారు.మాజీ ఐపీఎస్ అధికారి నుంచి రాజకీయ నాయకుడిగా మారిన అన్నామలై మాట్లాడుతూ “నిబంధనలు కఠినంగా ఉండాలి. సినిమాలో పెద్ద తారలు నటించినప్పటికీ, ఏ సన్నివేశాలను ప్రదర్శించవచ్చో నిర్ణయించే విషయంలో సెన్సార్ బోర్డు కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలి.”ఆ సినిమా విజయం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ, మహిళలను ఒక నిర్దిష్ట దృక్పథంతో చూపించే సినిమాలను పిల్లలు చూస్తే అది ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని అన్నామలై పేర్కొన్నారు.ఈ సినిమా విడుదలైన మొదటి రోజే ?104 కోట్లు వసూలు చేసింది. ఇందులో మహిళలను ఒక నిర్దిష్టమైన రీతిలో చూపిస్తున్నారు; ఇలాంటి సినిమాలను మనం పిల్లలకు ప్రతిరోజూ చూపిస్తే, ఈ దేశంలో మహిళల పరిస్థితి ఏమవుతుంది? అని ప్రశ్నించారు.ఇదిలావుంటే.. హైదరాబాద్‌లో జరిగిన ‘టాక్సిక్’ ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో చిత్రంలో మహిళలను చూపించిన విధానంపై వచ్చిన విమర్శలకు యశ్ స్పందిస్తూ.. దర్శకురాలు గీతూ మోహన్‌దాస్‌కు మద్దతుగా నిలిచారు.ఈ పీరియడ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాను కేవీఎన్ ప్రొడక్షన్స్, యష్ యొక్క మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ నిర్మించాయి. అత్యంత ఖరీదైన భారతీయ చిత్రాలలో ఒకటిగా ప్రచారం పొందుతున్న దీనిని కన్నడ, ఆంగ్ల భాషలలో చిత్రీకరించారు. ఈ చిత్రంలో యష్ ద్విపాత్రాభినయం చేయగా, నయనతార, తారా సుతారియా, కియారా అద్వానీ, హుమా ఖురేషి, రుక్మిణి వసంత్ కూడా నటించారు.



## వైఖానస ఆగమ సంప్రదాయానికి విఖనస మహర్షి మూలపురుషుడు

**హసన్‌పర్తిలో ఘనంగా విఖనస మహర్షి జయంతి వేడుకలు**

**ప్రజా వాయిస్ హన్మకొండ /హసన్ పర్తి**

హసన్‌పర్తి: శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రీ వైఖానస సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ విఖనస మహర్షి జయంతి వేడుకలు హసన్‌పర్తి మండల కేంద్రంలోని ఎర్రగట్టుగుట్ట స్వయంభూ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి మహర్షికి నివాళులర్పించారు.సమితి కోశాధికారి డాక్టర్ దీవి అజిత్ కుమార్ మాట్లాడుతూ.. వైఖానస ఆగమ సంప్రదాయం, ఆలయ ఆరాధనా విధానాలకు శ్రీ విఖనస మహర్షి మూలపురుషుడని తెలిపారు. సనాతన ధర్మం, ఆధ్యాత్మిక సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు వేదాంతం పార్థసారధి ఆచార్యులు, పలువురు ఆచార్యులు, భక్తులు పాల్గొన్నారు.



## మైదానంలో గంట..ఆరోగ్యం మీ వెంట

**ప్రజా వాయిస్,సుల్తానాబాద్:**

మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని సుల్తానాబాద్ ఖేల్ ఇండియా సెంటర్‌లో శుక్రవారం 'ఏక్ గంట్ ఖేల్ కే మైదాన్ మే' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులు, విద్యార్థులు వివిధ క్రీడలు, వ్యాయామాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత మాట్లాడుతూ.. ఆధునిక జీవనశైలితో పెరుగుతున్న ఒత్తిళ్లు, అనారోగ్య సమస్యలను అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ రోజూ కొంత సమయం వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు రోజుకు కనీసం గంటసేపు మైదానంలో గడపాలని పిలుపునిచ్చారు. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయన్నారు. ఆగస్టు 30 వరకు జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి ఏ. సురేష్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, కార్యదర్శి అమీరిశెట్టి తిరుపతి, కోచ్‌లు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



## తాత లేడు.. జ్ఞాపకం మాత్రం ఉంది

**చిత్రపటానికే రాఖీ కట్టి తాతయ్యపై ప్రేమ చాటుకున్న మనవరాలు**

**ప్రజావాయిస్, సంస్థాన్ నారాయణపురం:**

తాతయ్య భౌతికంగా దూరమైనా.. ఆయన జ్ఞాపకాలు మాత్రం ఆరాధ్యను వీడలేదు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన గంగాపురం శ్రీరాములు గౌడ్ మృతి చెంది దాదాపు మూడేళ్లు కావస్తున్నా.. ఆయన మనవరాలు వీరమల్ల ఆరాధ్య తాతయ్యపై తనకున్న ప్రేమను మరచిపోలేదు.తాతయ్యే తనకు ధైర్యమని భావించే ఆరాధ్య.. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆయన చిత్రపటానికి రాఖీ కట్టి భావోద్వేగానికి గురైంది. తాతయ్య ఎక్కడ ఉన్నా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంది. అనంతరం మిత్రులు, బంధువులకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపింది. తాత-మనవరాలి మధ్య ఉన్న ఈ ఆత్మీయ బంధం స్థానికులను కదిలించింది.



## అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ కోసం ఒత్తిడి తెస్తాం

**డా.పాల్వాయి హరీష్ బాబు**

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నాయకులు సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబును కలిశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, దాని ద్వారా రాష్ట్రంలో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న 5 లక్షల మంది ఉద్యోగులకు వేతనాలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు.ఈ హామీ అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని నాయకులు ఎమ్మెల్యేను కోరారు. రాబోయే వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశంపై వాయిదా తీర్మానం ప్రవేశపెట్టి చర్చకు పట్టుపడతామని డా.పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. ఇటీవల మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో జూనియర్ లెక్చరర్ల అక్రమ టెర్మినేషన్ విషయంలో అండగా నిలిచి తిరిగి ఉపాధి కల్పించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు.ఈ కార్యక్రమంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీరామ నామ హృదయ కలశం అందజేత

**ప్రజా వాయిస్, హుజూర్‌నగర్, ఆగస్టు 28**

శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి 70వ వసంతాల సందర్భంగా హుజూర్‌నగర్‌లో చేపట్టిన శ్రీరామనామ సంకీర్తన కార్యక్రమంలో భాగంగా శ్రీరామనామ హృదయ కలశాన్ని పురపాలక సంఘ చైర్‌పర్సన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ కు అందజేశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దంపతులు శ్రీనివాస్ గౌడ్, పద్మ బియ్యం సమర్పించారు. భక్తి, ఆధ్యాత్మికతను ప్రతి ఇంటికి చేరువ చేయాలనే సత్సంకల్పంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని వారు అభినందించారు.ఈ కార్యక్రమంలో మహిళా కౌన్సిలర్లు అట్లూరి మంజుల హరిబాబు, దొంతిరెడ్డి పద్మ, మాధవి, శిరీష,గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో భూమి ధరల కొత్త రికార్డు.. ఎకరం రూ.269 కోట్లు!

హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో భూముల ధరలు మరోసారి సరికొత్త రికార్డును సృష్టించాయి. రాయదుర్గంలో తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో ఎకరం ధర ఏకంగా రూ. 269 కోట్లు పలికింది. ప్రముఖ నిర్మాణ సంస్థ వంశీరాం బిల్డర్స్ ఈ భూమిని అత్యధిక ధరకు దక్కించుకుంది.రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1 పరిధిలోని 5.38 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం వేలానికి ఉంచింది. దీనికి ఎకరానికి రూ. 175 కోట్లను ప్రభుత్వం కనీస ధరగా నిర్ణయించింది. అయితే, ఆన్‌లైన్ వేలంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థల మధ్య తీవ్రమైన పోటీ నెలకొనడంతో ధర అనూహ్యంగా పెరిగింది. చివరికి ఎకరం రూ. 269 కోట్ల చొప్పున వంశీరాం బిల్డర్స్ ఈ స్థలాన్ని కైవసం చేసుకుంది. ఈ విక్రయం ద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 1,447 కోట్ల భారీ ఆదాయం సమకూరింది.వారం రోజుల క్రితమే ఈ ప్రాంతానికి సమీపంలోని మరో ప్లాట్ ఎకరం రూ. 264 కోట్లకు అమ్ముడై రికార్డు సృష్టించగా, తాజా వేలం ఆ రికార్డును అధిగమించింది. రాయదుర్గం పరిసరాల్లో గత కొంతకాలంగా భూముల ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. గతేడాది అక్టోబర్‌లో ఎకరం ధర రూ. 177 కోట్లు ఉండగా, ఈ ఏడాది మే నెలలో అది రూ. 237 కోట్లకు చేరింది. తాజాగా ఈ ధర రూ. 269 కోట్ల మైలురాయిని చేరుకోవడం గమనార్హం.హైదరాబాద్ ఐటీ హబ్, గచ్చిబౌలి, నాలెడ్జ్ సిటీ వంటి కీలక ప్రాంతాలకు అత్యంత సమీపంలో ఉండటంతో ఇక్కడి భూములకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ గిరాకీని ఆదాయంగా మార్చుకునే క్రమంలో ప్రభుత్వం చేపడుతున్న భూముల వేలానికి రియల్ ఎస్టేట్ రంగం నుంచి భారీ స్థాయిలో స్పందన లభిస్తోంది.



## హన్మకొండ జిల్లాలో ఘనంగా రక్షాబంధన్

**అక్కా తమ్ముళ్లు, అన్న చెల్లెల్ల ప్రేమానురాగాలకు ప్రతీక రాఖీ**

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి**

పవిత్రమైన రాఖీ పౌర్ణమి (రక్షా బంధన్) పండుగను పురస్కరించుకుని హన్మకొండ జిల్లా ప్రజలు.భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలలో రాఖీ పండుగకు అత్యంత విశిష్టమైన స్థానం ఉంది.అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ప్రేమానురాగాలకు, ఆప్యాయతలకు, రక్షణ బంధానికి ఈ పండుగ ప్రతీక ఒకే తల్లి కడుపున పుట్టినా, పుట్టకపోయినా కులమతాలకు అతీతంగా రక్షణ దారాన్ని (రాఖీ) కట్టి సోదర భావాన్ని చాటుకునే గొప్ప పండుగ రక్షా బంధన్. రక్షాబంధన్ని పురస్కరించుకొని. అక్క చెల్లెలు అన్నదమ్ములు ఆయురారోగ్యాలతో ఉండాలని. పాడి పంట. పిల్లలు ఆరోగ్యాలతో ఉండాలని. కోరుకున్న వృత్తుల్లో రాణించాలని.రక్తసంబంధాలు విడిపోవద్దని ఆయా దేవాలయాల్లో పూజలు నిర్వహించుకున్నారు. ప్రతి ఏటా ఈ పండుగ జరుపుకునేందుకు. ఆయురారోగ్యాలు ప్రసాదించాలని వే దుకున్న హనుమకొండ జిల్లా ప్రజలు.



## ఫూలాజీ బాబా జయంతి ఏర్పాట్లు

**డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ**

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం పట్నాపూర్ గ్రామంలో ఈ నెల 30న నిర్వహించనున్న శ్రీ శ్రీ శ్రీ సంత్ సద్గురు ఫూలాజీ బాబా 82వ జయంతి ఉత్సవాల ఏర్పాట్లను గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ శుక్రవారం పరిశీలించారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో వారికి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఉత్సవ ప్రాంగణాన్ని పరిశీలించి తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, పార్కింగ్, భక్తుల రాకపోకలు, భద్రత అంశాలపై చర్చించారు. భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్య సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో విజయవంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ జాదవ్ తనాజీ తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి

**పొనుగోటి రంగారావు మనుమరాలి వివాహ వేడుకకు హాజరు**



**మోతె, ప్రజావాయిస్:**

మోతె మండలం బోడబండ్లగూడెం గ్రామానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ పొనుగోటి రంగారావు మనుమరాలి వివాహ వేడుకకు కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, మోతె మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పందిళ్లపల్లి పుల్లారావు, గ్రామ సర్పంచ్ కంపెల్లి ఉమాశ్రీను, ఉపసర్పంచ్ శైలేందర్‌రావు, కాంగ్రెస్ మండల నాయకులు గుండ్ల లక్ష్మారెడ్డి, మామిడి వెంకటేశ్వర్లు గౌడ్, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మోత్కూర్ లో ఘనంగా గాయత్రీ ధారణ

**ప్రజా వాయిస్,మోత్కూరు(ఆగష్టు28):**
మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ శివ భక్త మార్కండేయ ఆలయంలో రాఖీ ( నూలు పౌర్ణమి ) పండుగను శుక్రవారం పద్మశాలీలు పద్మ బ్రాహ్మణులు మహేశ్వరం నాగరాజు ఆధ్వర్యంలో గాయత్రీ ధారణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.పూజా సామాగ్రిని దాత మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోచం జగన్ అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వచ్చే కార్తీకమాసంలో శ్రీ శివ భక్త మార్కండేయ ఆలయ ప్రారంభం చేయనున్నట్లు తెలిపారు.పద్మశాలీలు, దాతలు పెద్ద ఎత్తున సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పద్మశాలిలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తుర్కపల్లి పోలీసు స్టేషన్ లో ఘనంగా రాఖీ వేడుకలు



**ప్రజావాయిస్ /తుర్కపల్లి**
యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలో ఈ రోజు రక్షా బంధన్ పర్వదిన సందర్భంగా తుర్కపల్లి పోలీసులు తమ రోజు వారి విధులు నిర్వహిస్తూ , పోలీసు స్టేషన్ లో మహిళా సిబ్బంది, ఎస్ ఐ గారికి మరియు తోటి సిబ్బందికి రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుకున్నారు. మహిళల భద్రతా, గౌరవం, కోసం పోలీసులు ఎల్లప్పుడు ముందు ఉంటారనే భరోసా కల్పిస్తూ తుర్కపల్లి మండల ప్రజలకు రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపినారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి

**ప్రజా వాయిస్,మోత్కూరు,( ఆగష్టు28):**
మండల పరిధిలోని దత్తప్ప గూడెం గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలంటూ గ్రామస్తులు శుక్రవారం సర్పంచ్ కు వినతి పత్రాన్ని అందజేశారు.గ్రామంలోని కొత్తగూడెం, మెయిన్ రోడ్డుకు ఇరువైపులా నివసిస్తున్న ప్రజలు తీవ్ర తాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రోజుల తరబడి నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నామని,తాగునీటి సమస్యను పలుమార్లు సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించకపోవడం బాధాకరమని వినతిలోపేర్కొన్నారు.నీటి సరఫరా విషయంలో ప్రజలు వాటర్ మెన్ ను ప్రశ్నిస్తే ప్రజలతో దురుసుగా మాట్లాడుతున్నాడనీ, సర్పంచు,సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు చంద్రయ్య,లింగారెడ్డి, రాములు, లింగమ్మ, కమలమ్మ, సత్తమ్మ ,ఖలీల్ పాషా, అవిలయ్య, మల్లయ్య, నర్సింహా ,వెంకటేష్, జానీ మియా, శ్రీశైలం, మల్లయ్య, లక్ష్మి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.






## చెల్లికి అన్నరక్షణ... సమాజానికి పోలీసు రక్ష...

**ప్రజా వాయిస్, పాపన్నపేట**
రాఖీ పౌర్ణమి సందర్భంగా బ్లాలు కోల్ట్ విధుల్లో భాగంగా ఎన్ఫోర్స్మెంట్ నిర్వహిస్తున్న పాపన్నపేట పోలీసులు సోదరీ చేత రాఖీ కట్టించుకున్నారు. సమాజంలో పోలీసుల పాత్ర పెద్దన్నల రక్షణ కల్పించడమేనని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మహిళలు ఉద్యోగాలు, ఇతర పండ్ల కోసం ధైర్యంగా బయటకు రావడానికి పోలీసుల భద్రతపై ఉన్న నమ్మకమే కారణమన్నారు. చెల్లికి అన్న రక్షణగా, సమాజానికి పోలీసు రక్షణ అంటూ,, సోదరి శుభాకాంక్షలు తెలిపారు....



## రీసర్వేపై అదనపు కలెక్టర్ ఆరా

### భూ భారతి కింద రోవర్‌తో సాగుతున్న పనుల పరిశీలన

**ప్రజావాయిస్, బోయినపల్లి/వేములవాడ:**
రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కొత్తపేటలో భూ భారతి కింద రోవర్ యంత్రంతో చేపడుతున్న భూముల రీసర్వే పనులను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోవర్ యంత్రం ద్వారా భూముల వివరాలను ఏ విధంగా సేకరిస్తున్నారో స్వయంగా పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా భూ భారతి కింద రీసర్వే పనులను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామంలో సర్వే చేపడుతున్న విషయాన్ని రైతులకు ముందుగానే తెలియజేయాలని సూచించారు. భూములకు సంబంధించిన వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.భూముల వివరాలను పక్కాగా నమోదు చేయడంతో పాటు రీసర్వే ప్రక్రియను నిర్ణీత ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, తహసీల్దార్ షరీఫోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో పెరిగిన క్రైమ్ రేట్.. ఆందోళనకరంగా ఆర్గనైజ్డ్ క్రైమ్, డ్రగ్స్ కేసులు




తెలంగాణలో గత మూడేళ్లతో పోలిస్తే మొత్తం నేరాల సంఖ్య 7.15 శాతం మేర పెరిగింది. ముఖ్యంగా మాదకద్రవ్యాలు (నార్కోటిక్స్) సంబంధిత కేసులు 46.10 శాతం పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. డీజీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశంలో ఈ గణాంకాలను వెల్లడించారు.పోలీసు శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం, 2023–24లో 2,65,377గా నమోదైన మొత్తం కేసుల సంఖ్య, 2025–26 నాటికి 2,84,363కు చేరింది. ఇదే సమయంలో నార్కోటిక్స్ కేసులు 2,026 నుంచి 2,960కు పెరిగాయి. ఇక వ్యవస్థీకృత నేరాలు (ఆర్గనైజ్డ్ క్రైమ్) ఏకంగా 1,704 శాతం పెరుగుదలతో 25 నుంచి 451కి చేరడం గమనార్హం.కాగా, కొన్ని విభాగాల్లో నేరాలు గణనీయంగా తగ్గముఖం పట్టాయి. సైబర్ నేరాలు 13.29 శాతం, ఆర్థిక నేరాలు 13.28 శాతం తగ్గాయి. అలాగే హత్యలు, దోపిడీల వంటి తీవ్రమైన నేరాలు కూడా 10.33 శాతం మేర తగ్గాయి. ముఖ్యంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇటువంటి కేసులు నమోదు 26.23 శాతం తగ్గడం ఊరటనిచ్చే అంశం.మరోవైపు, చిన్నపాటి నేరాలు 7.28 శాతం పెరిగాయి. కొన్ని జిల్లాల్లో ఈ పెరుగుదల అధికంగా ఉంది. నార్కోటిక్స్ కేసుల పెరుగుదల పోలీసు శాఖకు పెద్ద సవాలుగా మారిందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా, ప్రతి నేరం వెనుక ఉన్న కారణాలను లోతుగా విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్) డేటా అప్‌డేట్ రేటు 96 శాతానికి చేరడంపై ఆయన సిబ్బందిని అభినందించారు. క్షేత్రస్థాయిలో పోలీసుల పనితీరులో వృత్తిపరమైన ప్రమాణాలు పాటించాలని, నేరాల కట్టడికి పటిష్ఠమైన ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు.

## పెన్షన్ దరఖాస్తులకు డెడ్‌లైన్

### మూడు రోజులే గడువు.. అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి

### ఆగస్టు 31తో ముగియనున్న స్వీకరణ.. 30లోపే అందజేయాలని

### పంచాయతీ కార్యదర్శి సృజన్ సూచన



**ప్రజా వాయిస్, పలిమెల:**
పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న అర్హులకు ప్రభుత్వం కల్పించిన దరఖాస్తు అవకాశం మరో మూడు రోజుల్లో ముగియనుంది. గ్రామపంచాయతీ పరిధిలోని వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, గీత కార్మికులు, నేత కార్మికులు తదితర అర్హులు ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోకపోతే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి సృజన్ సూచించారు.పెన్షన్ దరఖాస్తుల స్వీకరణకు ఆగస్టు 31, 2026 చివరి తేదీ అని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవసరమైన ధ్రువపత్రాలతో గ్రామపంచాయతీలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. చివరి రోజు వరకు వేచి ఉండకుండా ఆగస్టు 30లోపే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.చివరి రోజుల్లో పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావడం వల్ల ఆన్‌లైన్ ప్రక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సృజన్ కోరారు.

## విద్యార్థి నేస్తం ట్రస్ట్‌లో కొత్త బాధ్యతలు

- వికారాబాద్ జిల్లా కన్వీనర్‌గా వ్యాసరాజ్ కళ్యాణ్
- కో--కన్వీనర్‌గా ఎం. రవీందర్



**ప్రజావాయిస్/వికారాబాద్:**
విద్యార్థి నేస్తం ఎడ్యుకేషన్ ట్రస్ట్ వికారాబాద్ జిల్లా నూతన కమిటీని ప్రకటించింది. జిల్లా కన్వీనర్‌గా వ్యాసరాజ్ కళ్యాణ్, కో––కన్వీనర్‌గా ఎం. రవీందర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ట్రస్ట్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ పి. మురళీ మనోహర్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు.విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, నాయకత్వం, వ్యక్తిత్వ వికాసం రంగాల్లో విద్యార్థులు, యువతకు సేవలు అందించడమే లక్ష్యమని నూతన బాధ్యులు తెలిపారు. జిల్లాలో ట్రస్ట్ కార్యకలాపాలను విస్తరించి, యువతకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. త్వరలో హైదరాబాద్‌లో జాతీయ స్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## పనితీరుకు '100' మార్కులు

### నాణ్యత లోపిస్తే చర్యలు.. మెరుగైన పనికి ప్రోత్సాహం

### ఇంధన శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్




**ప్రజా వాయిస్,హన్మకొండ:**
విద్యుత్ సేవల్లో నాణ్యత, విశ్వసనీయత పెంచేందుకు టీజీఎన్‌పీడీసీఎల్ ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఇంధన శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల పనితీరును 100 మార్కుల విధానంలో అంచనా వేసి సెక్షన్లకు ర్యాంకులు, గ్రేడ్లు కేటాయిస్తున్నట్లు సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. కొత్త సర్వీసులు, రెవెన్యూ వసూళ్లు, ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ, ఎనర్జీ ఆడిట్, ఫిర్యాదుల పరిష్కారం, మీటర్ల మార్పిడి తదితర అంశాలను మదింపులో పరిగణిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక శిక్షణలు, క్షేత్రస్థాయి పనుల నాణ్యత తనిఖీలకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

## రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**ప్రజా వాయిస్, హుజూర్‌నగర్,**

**ఆగస్టు 28**



హుజూర్ నగర్ మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా, రాష్ట్ర నీటి పారుదల, ఆహార మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో రూ.5 లక్షల డిఎంఎఫ్టి నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను పురపాలక సంఘం చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఆయన ఇస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐఎన్టీయూసీ నాయకులు యరగాని నాగన్న గౌడ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కోతి సంపత్ రెడ్డి, కౌన్సిలర్లు వల్లెపు నాగరాజు, చెన్నగాని సైదులు, పులిచింతల వెంకట్ రెడ్డి, జక్కుల మల్లయ్య, యరగాని మురళి, వేముల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.